మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

Published from Jagitial
www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

బుధవారం WEDNESDAY 18-2-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 ‖ సంచిక: 230 Issue: 230


18 ఫిబ్రవరి 2026 - బుధవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు ఫాల్గుణ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:44 సూర్యాస్తమయం - సా. 6:15 తిథి పాడ్యమి సా. 4:54 వరకు తరువాత విదియ సంస్కృత వారం సౌమ్య వాసరః నక్షత్రం శతభిష రా. 9:04 వరకు తరువాత పూర్వాభాద్ర యోగం శివ రా. 10:36 వరకు కరణం బవ సా. 4:54 వరకు భాలవ తె. 4:30o వరకు వర్జ్యం తె. 3:33 నుండి తె. 5:07 వరకు దుర్ముహూర్తం మ. 12:06 నుండి మ. 12:52 వరకు రాహుకాలం మ. 12:30 నుండి మ. 1:56 వరకు యమగండం ఉ. 8:11 నుండి ఉ. 9:37 వరకు గుళికాకాలం ఉ. 11:03 నుండి మ. 12:30 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:08 నుండి తె. 5:56 వరకు అమృత ఘడియలు మ. 1:21 నుండి మ. 2:57 వరకు అభిజిత్ ముహూర్తం లేదు గమనిక: "o" అనగా మరుసటి రోజున

# ఐబొమ్మ రవికి బెయిల్



## ఇంటర్నెట్ వాడొద్దని హైకోర్టు షరతులు

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఈవార్తలు): ఐబొమ్మ వెబ్‌సైట్ నిర్వాహకుడు ఇమంది రవికి తెలంగాణ హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. కోర్టులో పాస్‌పోర్ట్ సరెండర్ చేయాలని, దేశం విడిచి వెళ్లొద్దని ఆంక్షలు విధించింది. రోజూ సీసీఎస్ ఎదుట హాజరుకావాలని ఆదేశించింది. రవి ఇంటర్‌నెట్ వినియోగంపైనా కోర్టు పూర్తి స్థాయిలో ఆంక్షలు విధించింది. అతడు ఎలాంటి ఇంటర్‌నెట్ సౌకర్యాన్ని సొంతంగా వాడకూడదని, ఒకవేళ అత్యవసర పరిస్థితుల్లో వాడాల్సి వస్తే ముందుగా పోలీసుల అనుమతి తీసుకోవాలని స్పష్టం చేసింది. రవి సినిమా పైరసీ, కాపీ రైట్, ఐటీ యాక్ట్‌తో పాటు మనీ లాండరింగ్ సహా.. మొత్తం ఐదు కేసుల్లో నిందితుడు.



# 'స్టే'తో ఎంజాయ్ చేశారు!

## ఐఏఎస్ శ్రీలక్ష్మి డిశ్చార్జ్ పిటిషన్‌పై సుప్రీం

న్యూఢిల్లీ/హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఈవార్తలు): ఏపీ సీనియర్ ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మికి సుప్రీం కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. గతంలో తెలంగాణ హైకోర్టు ఓఎంసీ కేసులో డిశ్చార్జ్ పిటిషన్‌ను కొట్టివేస్తూ ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు కూడా సమర్థించింది. తాము -2 వ పేజీలో...

# సిద్ధార్థ్ రెడ్డి లొంగిపో!

## నటి ప్రత్యూష కేసులో సుప్రీం ఆదేశాలు

న్యూఢిల్లీ/హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఈవార్తలు): దివంగత సినీ నటి ప్రత్యూష హత్యాచారం కేసులో ప్రధాన నిందితుడు సిద్ధార్థ్ రెడ్డికి సుప్రీంకోర్టు లో చుక్కెదురైంది. 24 ఏళ్లుగా కొనసాగుతున్న ఈ కేసులో దేశ అత్యున్నత న్యాయస్థానం తుది తీర్పును వెలువరించింది. ఈ కేసులో సిద్ధార్థ్ రెడ్డి పిటిషన్‌ను కొట్టేసిన కోర్టు.. నాలుగు వారాల్లో లొంగిపోవాలని ఆదేశాలు జారీచేసింది. తెలుగు సినీ పరిశ్రమలో తన అందం, నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్న తెలుగమ్మాయి ప్రత్యూష తక్కువ కాలంలోనే -2 వ పేజీలో...





# 23న కేబినెట్ సమావేశం

**బడ్జెట్ సమావేశాల నిర్వహణపై చర్చ!**

**కొత్త పథకాల అమలుపైనా నిర్ణయాలు**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న 2026-27 వార్షిక బడ్జెట్ రూపకల్పన ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఈ నేపథ్యంలో, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈ నెల 23న మధ్యాహ్నం 3 గంటలకు సచివాలయంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది.

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఈవార్తలు): అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నిర్వహణ, నిధుల కేటాయింపులు, కొత్త పథకాల అమలుపై ఈ భేటీలో ప్రభుత్వం కీలక నిర్ణయాలు -2 వ పేజీలో...

## సోషల్ మీడియాపై వయసుల వారీగా ఆంక్షలు!

## డిజిటల్ అడిక్షన్ తగ్గించే చర్యల దిశగా కేంద్రం

### టెక్ కంపెనీలతో చర్చలు: కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్

సోషల్ మీడియా వినియోగంపై వయసుల వారీ పరిమితులు విధించాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఇందులో భాగంగా ఆయా టెక్ కంపెనీలతో చర్చలు జరుపుతోంది.



# వయసుకు వచ్చారా?



సోషల్‌మీడియా వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాల దృష్ట్యా ఫ్రాన్స్, ఆస్ట్రేలియా తదితర దేశాలు చిన్నారులు సోషల్‌మీడియా వాడకుండా నిషేధం విధించాయి. ఈ నేపథ్యంలో భారత్ కూడా ఆ దిశగా అడుగులు వేస్తోందని కేంద్రమంత్రి వైష్ణవ్ తెలిపారు.

న్యూఢిల్లీ: ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో భాగంగా కేంద్రమంత్రి మీడియాతో మాట్లాడుతూ.. "ప్రస్తుతం మేం డీప్‌ఫేక్‌లు, వయసు ఆధారిత నియంత్రణలపై వివిధ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లతో చర్చలు జరుపుతున్నాం. అనేక దేశాలు వయసు ఆధారిత నియంత్రణలను అంగీకరించాయి. భారతదేశంలో ఇది అవసరమని భావిస్తున్నాం" అని అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. బడ్జెట్ సందర్భంగా ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే సైతం డిజిటల్ ఎడిక్షన్‌ను తగ్గించేందుకు వయసు ఆధారిత సోషల్ మీడియా అందుబాటు వ్యవస్థను ప్రవేశపెట్టాలని అభిప్రాయపడింది. పలువురు ఎంపీలు సైతం ఈ అంశాన్ని లేవనెత్తారు. ఈ నేపథ్యంలోతరువాయి 2 వ పేజీలో...

# కాంగ్రెస్‌కు 'లక్కీ'

## లక్కీడ్రాలో హస్తం ఖాతాలోకి తొర్రూరు, జనగామ



మెజారిటీ మున్సిపాలిటీ ఛైర్మన్ పీఠాలను కాంగ్రెస్ వశం అవుతున్నాయి. జనగామ మున్సిపాలిటీ, తొర్రూర్ మున్సిపాలిటీని తమ ఖాతాలో వేసుకుంది. లక్కీ డ్రాలో కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందారు. జనగామ జిల్లా జనగామ మున్సిపల్ ఎన్నికలో కాంగ్రెస్ చైర్మెన్ అభ్యర్థికి మొత్తం 16 ఓట్లు రాగా...బిఆర్ఎస్ పార్టీ చైర్మెన్ అభ్యర్థిగోపగాని సుగుణాకర్ కూడా 16 ఓట్లు వచ్చాయి. దీంతో అధికారులు లక్కీ డ్రా వేశారు. ఇద్దరి పేర్లు రాసి డ్రా తీశారు. దీంతో లక్కీ డ్రాలో కాంగ్రెస్ చైర్మన్ అభ్యర్థి కదకంచి బాలమణిని అదృష్టం వరించింది.

తొర్రూరు, జనగామ, ఫిబ్రవరి 17 (ఈవార్తలు): వైస్ ఛైర్మన్ గా బీఆర్ఎస్ అభ్యర్థి పర్వతాలు ఎన్నికయ్యారు. తొర్రూరులో తుణం శ్రవణ్‌ను అదృష్టం వరించింది. శ్రవణ్ మున్సిపల్ ఛైర్మన్‌గా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు. వైస్ చైర్మన్ డ్రా పద్ధతిలో కాంగ్రెస్ అభ్యర్థి సోమ రజినీ ఎన్నికయ్యారు. అటు మెదక్ జిల్లా జహీరాబాద్ మున్సిపాలిటీ కూడా కాంగ్రెస్ గెలుచుకుంది. చివరి నిమిషంలో స్వతంత్ర అభ్యర్థి కాంగ్రెస్‌కు మద్దతివ్వడంతో మున్సిపల్ ఛైర్మన్ పదవికి యూనస్ తరువాయి 2 వ పేజీలో...



## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,420 |
| వెండి (గ్రాము): | రూ.265 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,863 |

# ఏఐ సూపర్ పవర్‌గా భారత్

## ప్రపంచంలో టాప్ 3 మా టార్గెట్

**వికసిత్ భారత్ 2047 లక్ష్యంగా అడుగులు.. ప్రధాని మోదీ స్పష్టీకరణ**

ప్రపంచంలోని టాప్-3 ఏఐ సూపర్ పవర్‌గా భారత్ ఉండాలన్నదే తమ లక్ష్యమని ప్రధాని మోదీ అన్నారు. వికసిత్ భారత్ 2047 లక్ష్యం ఇదేనని తెలిపారు. ఓ ప్రముఖ ఆంగ్ల వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. 'ప్రస్తుతం ఏఐ, నాగరికత పరంగా ఒక కీలక మలుపులో నిలిచి ఉంది. ఇది మానవ సామర్థ్యాన్ని ఊహించని విధంగా విస్తరించగలదు.

న్యూఢిల్లీ: సరైన మార్గనిర్దేశం లేకపోతే ప్రస్తుతం ఉన్న సామాజిక పునాదులను దెబ్బతీయగలదు. అందుకే మేము ఈ సమ్మిట్‌ను కేవలం ఆవిష్కరణల చుట్టూ కాకుండా, అర్థవంతమైన, సమానమైన ఫలితాలను అందించే 'ప్రభావం' చుట్టూ ఉద్దేశపూర్వకంగా రూపొందించాం. దీని మార్గదర్శక స్ఫూర్తి, సర్వజన్ హితాయ్, సర్వజన్ సుఖాయ్, దేశ నాగరికత తత్వాన్ని ప్రతిబింబిస్తుంది. సాంకేతికత అంతిమ లక్ష్యం 'అందరి సంక్షేమం, అందరి ఆనందం' తరువాయి 2 వ పేజీలో...






# లైఫ్ సైన్సెస్ కేరాఫ్ హైదరాబాద్

గ్లోబల్ లైఫ్ సైన్సెస్, హెల్త్‌కేర్ రంగంలో హైదరాబాద్ తన ప్రస్థానాన్ని మరింత వేగవంతం చేస్తోంది. నగరంలోని హెచ్ఐసీసీ (న×జజ) వేదికగా ప్రారంభమైన 'బయో ఏషియా 2026' సదస్సును తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఈవార్తలు): ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధికి సంబంధించి ప్రభుత్వం పెట్టుకున్న ప్రతిష్టాత్మక లక్ష్యాలను వివరించారు. లైఫ్ సైన్సెస్ రంగంలో తెలంగాణ ఇప్పటికే అంతర్జాతీయ -2 వ పేజీలో...

## విశ్వవాణి



తేళ్లు శ్వాసను 6 రోజుల వరకు బిగపట్టగలవు. ఆహారం లేకుండా ఏకంగా సంవత్సరం పాటు బతికేస్తాయి. యూవీ కాంతిలో నీలం రంగులో మెరుస్తాయి. ఇవి 400 మిలియన్ సంవత్సరాలుగా భూమ్మీద మనుగడలో ఉన్నాయి.

# పంచాయతీల అకౌంట్లలో 250 కోట్లు




గ్రామ పంచాయతీలకు రేవంత్ సర్కార్ గుడ్‌న్యూస్ చెప్పింది. గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం రూ. 250 కోట్లు నిధులు విడుదల చేస్తున్నట్టు పేర్కొంది. ఈ మేరకు డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ఆదేశాలతో మంగళవారం ఆర్థిక శాఖ ఈ నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఈవార్తలు): రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల కోసం కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధుల కింద ఇటీవలే రెండో విడతగా రూ. 387 కోట్ల నిధులను విడుదల చేసింది. ఈ నిధులను గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికిగాను, పారిశుద్ధ్యం, తాగునీటి సదుపా యాలకుగాను, రహదారులను పునరుద్ధరించేందుకు, కొత్త రోడ్లను నిర్మించేందుకు ఉపయోగించాలని కేంద్రం పేర్కొంది. ఈ మేరకు తరువాయి 2 వ పేజీలో...




# ఇండ్లు.. క్యూర్

## కోర్ అర్బన్ రీజియన్‌ల ఇందిరమ్మ ఇండ్లు

**మార్చి చివరి నాటికి లబ్ధిదారుల ఎంపిక**

**అసంపూర్తి డబుల్ బెడ్రూంల నిర్మాణానికి చర్యలు**

**ఈ నెల చివర్లో 28 వేల మందికి ఇందిరమ్మ ఇండ్లు**

మంత్రులు పొంగులేటి, దుద్దిళ్ల, పొన్నం సమీక్ష 2



# మార్చి 16 నుంచి ఒంటిపూట బడులు

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఈవార్తలు): పెరుగుతున్న ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని తెలంగాణ పాఠశాల విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ , ప్రైవేట్ పాఠశాలలకు వచ్చే నెల మార్చి 16 నుంచి ఒంటిపూట బడులు -2 వ పేజీలో...

# రాశి ఫలాలు



18.2.2026

మేషం: స్థిరాస్తి వివాదాలకు సంబంధించి ఆత్మీయుల నుంచి ముఖ్య సమాచారం అందుతుంది. సన్నిహితుల సహాయంతో నూతన కార్యక్రమాలు చేపట్టి సకాలంలో పూర్తి చేస్తారు. ఇంటాబయట పరిస్థితులు అనుకూలిస్తాయి. వృత్తి వ్యాపారాల్లో పురోగతి సాధిస్తారు. ఉద్యోగాలలో బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తారు.

వృషభం: వృధా ప్రయాణాలు చేయవలసి వస్తుంది. ఆర్థిక లావాదేవీలు మందకొడిగా సాగుతాయి. ముఖ్యమైన వ్యవహారాలు శ్రమ అనంతరం పూర్తవుతాయి. ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. వ్యాపారాలలో సొంత నిర్ణయాలు అంతగా కలిసిరావు. నిరుద్యోగ యత్నాలు మందగిస్తాయి. వృత్తి ఉద్యోగాలలో శ్రమ అధికమవుతుంది.

మిధునం: దూర ప్రయాణాలు వాయిదా వేయుట మంచిది. వ్యాపార వ్యవహారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. చేపట్టిన వ్యవహారాలు నత్తనడకన సాగుతాయి. మిత్రులతో మాటపట్టింపులు కలుగుతాయి. ఆరోగ్య విషయంలో కొంత జాగ్రత్త వహించాలి. ఉద్యోగమున పని ఒత్తిడి అధికమవుతుంది.

కర్కాటకం: ఇంటా బయట పరిస్థితులు అనుకూలిస్తాయి. చేపట్టిన పనులలో అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. సమాజంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. నిరుద్యోగుల కలలు సహకారం అవుతాయి. వ్యాపారాలలో తగినంత లాభాలు అందుకుంటారు. ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది.

సింహం: ఆకస్మిక ధనలాభం కలుగుతుంది. స్థిరాస్తి ఒప్పందాలు వాయిదా పడతాయి. నూతన కార్యక్రమాలు ప్రారంభించిన అప్రయత్నంగా పూర్తి చేస్తారు. దైవ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. గృహ వాతావరణం చికాకుగా ఉంటుంది. వ్యాపారాలు కొంత మెరుగైన పరిస్థితులు ఉంటాయి, ఉద్యోగాలలో అధికారుల ఆదరణ పెరుగుతుంది.

కన్య: మిత్రుల నుంచి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. ముఖ్యమైన వ్యవహారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. చేపట్టిన పనులు ముందుకు సాగక నిరాశ పెరుగుతుంది. దూరప్రయాణ సూచనలున్నవి. నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. వ్యాపారపరంగా తొందరపాటు నిర్ణయాలు చేయడం మంచిది కాదు. ఆర్థికంగా స్వల్ప ఇబ్బందులు ఉంటాయి.

తుల: ఆర్థిక పరిస్థితి గందరగోళంగా ఉంటుంది. బంధుమిత్రుల వలన ఊహించని సమస్యలు కలుగుతాయి. దూర ప్రయాణాలు వాయిదా వేయుట మంచిది. పాత ఋణాలు తీర్చడానికి నూతన ఋణాలు చేస్తారు. అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. వ్యాపారాలు మందకోడిగా సాగుతాయి. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి.

వృశ్చికం: కుటుంబ సభ్యులతో పుణ్యక్షేత్రాలు దర్శించుకుంటారు. వృత్తి వ్యాపారాలు మరింత అనుకూలంగా సాగుతాయి. వృత్తి వ్యాపారాలలో మీ శ్రమకు తగిన ఫలితం లభిస్తుంది. చేపట్టిన పనుల్లో విజయం సాధిస్తారు. నూతన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. ఉద్యోగమున బాధ్యతలు సమర్థవంతంగా నిర్వర్తిస్తారు.

ధనస్సు: ఆర్థిక పరిస్థితి కొంత నిరాశ కలిగిస్తుంది. ముఖ్యమైన పనులు వాయిదా వెయ్యటం మంచిది. కుటుంబసభ్యులతో మాట పట్టింపులు కలుగుతాయి. వృత్తి వ్యాపారాలలో శ్రమాధిక్యత పెరుగుతుంది. నిరుద్యోగ ప్రయత్నాలు మందగిస్తాయి. ఉద్యోగము అధికారులతో ఓర్పుగా వ్యవహరించడం మంచిది.

మకరం: ఇంటాబయట బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తారు. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. మొండి బకాయిలు వసూలవుతాయి. దైవ సేవాకార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపార విస్తరణకు ప్రయత్నాలు అనుకూలిస్తాయి. ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. ఆర్థిక అనుకూలత కలుగుతుంది.

కుంభం: కొన్ని పనులు శ్రమతో కానీ పూర్తి కావు. ఇతరులతో మాట పట్టింపులు తప్పవు. చేపట్టిన వ్యవహారాలు ముందుకు సాగక నిరాశ పెరుగుతుంది. ఉదర సంబంధిత అనారోగ్య సమస్యలు ఇబ్బంది కలిగిస్తాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. వ్యాపార ఉద్యోగాలు కొంత సామాన్యంగా సాగుతాయి.

మీనం: నూతన వాహనం కొనుగోలు చేస్తారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తవుతాయి. దూరపు బంధువుల నుంచి శుభవార్తలు అందుతాయి. దైవ కార్యక్రమాలలో నిర్వహిస్తారు. బంధుమిత్రులతో విందువినోదాల కార్యక్రమాల్లో పాల్గొంటారు. వ్యాపారాలలో అవాంతరాలు తొలగుతాయి. ఉద్యోగ వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది.

# మార్చి 16 నుంచి ఒంటిపూట బడులు

మొదటి పేజీ తరువాయి

ప్రారంభం కానున్నట్లు విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ వెల్లడించారు. ఈ కొత్త నిబంధనల ప్రకారం, పాఠశాలలు ఉదయం 8:00 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 12:30 గంటల వరకు మాత్రమే కొనసాగుతాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు మధ్యాహ్నం 12:30 గంటలకు భోజనం వడ్డించి, ఆ తర్వాత వారిని ఇంటికి పంపిస్తారు. అయితే, పదో తరగతి పరీక్షా కేంద్రాలుగా ఉన్న పాఠశాలల పని వేళల్లో విద్యాశాఖ స్వల్ప మార్పులు చేసింది. బోర్డు పరీక్షలు ఉదయం పూట జరుగుతున్నందున, అటువంటి పాఠశాలల్లో తరగతులు మధ్యాహ్నం 1:00 గంట నుండి సాయంత్రం 5:00 గంటల వరకు నిర్వహిస్తారు. పదో తరగతి విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక తరగతులు పరీక్షల సమయం వరకు యధావిధిగా కొనసాగుతాయి. మరోవైపు, రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఉర్దూ మీడియం పాఠశాలలు , డైట్ కళాశాలలకు ప్రత్యేక సమయాలను కేటాయించారు. ఇవి ఫిబ్రవరి 19 నుంచి మార్చి 20 వరకు ఉదయం 8:00 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు పనిచేస్తాయి. ఈ సమయంలో తగ్గిన పని గంటలను భర్తీ చేసేందుకు మార్చి 20 తర్వాత అదనపు తరగతులు నిర్వహించనున్నారు. వేసవి సెలవుల షెడ్యూల్‌ను కూడా విద్యాశాఖ ఇప్పటికే ఖరారు చేసింది. ప్రస్తుత విద్యాసంవత్సరానికి చివరి పనిదినం ఏప్రిల్ 23 కాగా, ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు రాష్ట్రవ్యాప్తంగా వేసవి సెలవులు అమలులో ఉంటాయి. తిరిగి కొత్త విద్యా సంవత్సరం (2026-27) జూన్ 12 నుంచి ప్రారంభమవుతుంది. ఎండల తీవ్రత నుంచి విద్యార్థులను రక్షించేందుకు విద్యాశాఖ తీసుకున్న ఈ నిర్ణయాన్ని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గమనించాలని అధికారులు సూచించారు.

# వయసుకు వచ్చారా?

మొదటి పేజీ తరువాయి

కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా చొరవ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ అంశం సంప్రదింపుల దశలో ఉంది.

### అనివార్య చర్య ఇది

నేటి డిజిటల్ యుగంలో సోషల్ మీడియా ఒక మాయా ప్రపంచంగా మారింది. కానీ ఆ మాయాజాలం మైనర్ల పసి మనసులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ నేపథ్యంలో చిన్నారులను సోషల్ మీడియాకు దూరం పెట్టాలనే నిర్ణయం నియంత్రణ మాత్రమే కాదు, వారి భవిష్యత్తుకు ఒక రక్షణ కవచం వంటిది. నిరంతరం స్క్రోలింగ్ చేయడం, ఇతరులతో పోల్చుకోవడం వల్ల పిల్లల్లో కుంగుబాటు (డిప్రెషన్), ఆందోళన, ఆత్మన్యూనతా భావం పెరుగుతున్నాయి. సోషల్ మీడియాలో సైబర్ బుల్లీయింగ్ (వేధింపులు) పెరగడం వల్ల అనేకమంది మైనర్లు తీవ్ర మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు. వయసుకి మించిన కంటెంట్, అశ్లీలత మరియు ద్వేషపూరిత ప్రసంగాలు సులభంగా అందుబాటులో ఉండటం వల్ల పిల్లల స్వభావం దెబ్బతింటోంది. సోషల్ మీడియా వ్యసనం వల్ల చదువుపై ఏకాగ్రత తగ్గి, నిద్రలేమి వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. సాంకేతికతను నిషేధించడం పరిష్కారం కాకపోవచ్చు, కానీ పిల్లల మెదడు పరిణతి చెందని వయసులో వాటిని నియంత్రించడం ప్రభుత్వాలు మరియు తల్లిదండ్రుల బాధ్యత. కేవలం చట్టాలు మాత్రమే కాకుండా, తల్లిదండ్రుల్లో అవగాహన పెరిగినప్పుడే ఈ నిషేధం పూర్తిస్థాయిలో విజయవంతమవుతుంది.

### ఏయే దేశాల్లో ఎలా..

ఆస్ట్రేలియా: 16 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియాను పూర్తిగా నిషేధించిన ప్రపంచంలోనే మొదటి దేశం. ఈ చట్టం డిసెంబర్ 2025 నుండి అమలులోకి వచ్చింది.

ఫ్రాన్స్: 15 ఏళ్లలోపు మైనర్లకు సోషల్ మీడియాను నిషేధించే బిల్లును ఆమోదించింది. ఇది సెప్టెంబర్ 2026 నుండి అమలులోకి వచ్చే అవకాశం ఉంది.

మలేషియా: 16 ఏళ్లలోపు వారికి సోషల్ మీడియా వాడకాన్ని నిషేధిస్తున్నట్లు ప్రకటించింది. ఇది జూలై 2026 నుండి అమలయ్యే అవకాశం ఉంది.

నార్వే: సోషల్ మీడియా వాడకానికి కనీస వయస్సును 13 నుంచి 15 ఏళ్లకు పెంచింది.

స్పెయిన్: 16 ఏళ్లలోపు మైనర్లు సోషల్ మీడియాను ఉపయోగించకుండా చట్టం తీసుకువచ్చే ప్రక్రియలో ఉంది.

బ్రిటన్: 16 ఏళ్లలోపు వారికి సోషల్ మీడియాపై ఆంక్షలు విధించే దిశగా అడుగులు వేస్తోంది.

డెన్మార్క్: 15 ఏళ్లలోపు పిల్లలపై సోషల్ మీడియా నిషేధానికి సిద్ధమవుతోంది.

# ఇండ్లు.. క్యూర్

**కోర్ అర్బన్ రీజియన్‌ల ఇందిరమ్మ ఇండ్లు**

**మార్చి చివరి నాటికి లబ్ధిదారుల ఎంపిక**

**పొంగులేటి, దుద్దిళ్ల, పొన్నం, అజారుద్దీన్ సమీక్ష**

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఈవార్తలు): హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ)పరిధి లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఇందుకు సంబంధించి వచ్చే మార్చి చివరినాటికి లబ్దిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేస్తామని ప్రకటించారు. మురికివాడల్లో ఇందిరమ్మ మోడల్ కాలనీలు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి స్థలాల సేకరణ,అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం పూర్తి, పూర్తయిన ఇండ్ల కేటాయింపు తదితర అంశాలపై మంగళవారం సచివాలయంలోని తన కార్యాలయంలో రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులు డీ శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ తో కలిసి సమీక్షించారు. ఈ సమావేశంలో హౌసింగ్ కార్యదర్శి విపి గౌతమ్, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, మూడు మున్సిపల్ కార్పొరేషన్ల కమీషనర్లు పాల్గొన్నారు. పట్టణాల్లోని మురికివాడల్లో జీవనం కొనసాగిస్తున్న పేదలు అక్కడే ఉండడానికి ఇష్టపడుతున్నారని ముఖ్యంగా హైదరాబాద్ నగరానికి దూరంగా ఇండ్లు నిర్మించి ఇస్తే తమ జీవనోపాధికి ఇబ్బంది కలుగుతుందన్న ఉద్దేశంతో ఇండ్లు తీసుకోవడానికి ఆసక్తి చూపడం లేదని హైదరాబాద్‌కు దూరంగా గతంలో 42వేల ఇండ్లను నిర్మించగా అందులో సగం మంది మాత్రమే అక్కడ నివసిస్తున్నారని ఇటీవల నిర్వహించిన క్షేత్రస్థాయి సర్వేలో తేలిందని సమావేశంలో అధికారులు మంత్రుల దృష్టికి తీసుకువచ్చారు. అలాగే చాలాచోట్ల బోగస్ లబ్దిదారులు కూడా ఉన్నారని అధికారులు మంత్రులకు వివరించారు. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆలోచనలకు అనుగుణంగా ,నిరుపేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా, వారి నివాస ప్రాంతాలకు దగ్గరగా స్థానిక పరిస్థితులను బట్టి ఐదు నుంచి 10 అంతస్థుల ఇందిరమ్మ ఇండ్లను నిర్మించాలనే ఆలోచన చేస్తున్నామని ,వచ్చే క్యాబినెట్ సమావేశంలో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ముగ్గురు మున్సిపల్ కార్పొరేషన్ల కమీషనర్లు, నాలుగు జిల్లాల కలెక్టర్లు సమన్వయంతో వారి వారి ప్రాంతాలలో స్థలాలను గుర్తించి ఎన్ని ఇండ్లు నిర్మించవచ్చు, ఎంతమంది లబ్దిదారులు ఉన్నారు వంటి వివరాలతో పదిరోజుల్లో నివేదిక అందజేయాలని ఆదేశించారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మురికివాడల్లో స్థలం ఉన్నవారు అంగీకరిస్తే ఆ ప్రాంతంలో జీప్లస్ 5 వరకు ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి అభివృద్ధి చేయాలన్న ఆలోచన చేస్తున్నామని జేఎన్ఎన్‌యూ ఆర్ ఎం పథకంలో నిర్మించిన ఇండ్లు శిధిలావస్థకు చేరాయని వాటి స్థానంలో కూడా ఇందిరమ్మ ఇండ్లు నిర్మించే ఆలోచన చేస్తున్నామన్నారు. మూడు మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో ఇండ్ల స్థలాలు ఉన్న 28వేల మంది లబ్దిదారులకు ఈనెల చివరిలోగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందజేయాలని అధికారులను ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న, ఇప్పటికే పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు మార్చి చివరినాటికి లబ్దిదారులను ఎంపిక చేయాలని ఆయా జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న ఇండ్లకు లబ్దిదారులను గుర్తించి ఆ లబ్దిదారులే ఆ ఇండ్లను పూర్తి చేసుకోవడానికి అంతకు ముందు ఖర్చుచేసిన మొత్తాన్ని పరిగణనలోకి తీసుకొని మిగిలిన నిధులను హౌసింగ్ కార్పొరేషన్ నిధులను మంజూరు చేస్తుందని తెలిపారు. విద్యుత్ పంపిణీ సంస్థలు విద్యుత్ మీటర్లను లబ్దిదారుల పేర్లకు బదిలీ చేయాలని అలాగే 2బిహెచ్‌కే కాలనీల్లో తాగునీటి సరఫరా మౌలిక సదుపాయాలు, ఎస్టీపీలు, మరియు యూజీడీల వ్యవస్థ హైదరాబాద్ వాటర్ బోర్డు పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. అటు.. ట్రిపుల్ ఆర్- ఓఆర్ఆర్ పరిధిలో మధ్యతరగతి ప్రజల కోసం గతంలో కెపిహెచ్‌బిలో నిర్మించిన మాదిరిగానే ఇండ్లను నిర్మిస్తామని ఇందుకు నాలుగు ప్రాంతాల్లో స్థలాలను గుర్తించి పది రోజుల్లో నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

# కాంగ్రెస్‌కు 'లక్కీ'

మొదటి పేజీ తరువాయి

ఎన్నికయ్యారు. ఎన్నికల ఫలితాలు వెలువడి, పాలకవర్గాల ఎన్నిక ముగియడంతో ఎన్నికల నియమావళి తక్షణమే రద్దవుతున్నట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. జనవరి 27న ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నాటి నుంచి రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్ల పరిధిలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. కోడ్ అమలులో ఉన్న సమయంలో కొత్త పథకాల ప్రకటనలు, బదిలీలు, ప్రభుత్వ ప్రచారాలపై ఆంక్షలు కొనసాగాయి. ఇప్పుడు కోడ్ ఎత్తివేయడం తో నిలిచిపోయిన అభివృద్ధి పనులు, పరిపాలనా పరమైన నిర్ణయాలు, బదిలీల ప్రక్రియ తిరిగి ప్రారంభం కానున్నాయి. ఎన్నికల కోడ్ ముగియడంతో అటు అధికార యంత్రాంగం, ఇటు రాజకీయ నేతలు ఊపిరి పీల్చుకున్నారు. నూతనంగా ఎన్నికైన మేయర్లు, చైర్మన్లు నేటి నుంచి తమ తమ కార్యాలయాల్లో బాధ్యతలు స్వీకరించి, అభివృద్ధి పనులపై దృష్టి సారించనున్నారు. ముఖ్యంగా హంగ్ ఏర్పడి ఉత్కంఠ రేపిన మున్సిపాలిటీలలో కూడా ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగియడంతో రాష్ట్రవ్యాప్తంగా సాధారణ పరిస్థితులు నెలకొన్నాయి.

# 23న కేబినెట్ సమావేశం

మొదటి పేజీ తరువాయి

తీసుకోనుంది. ఈ కేబినెట్ సమావేశంలో ప్రధానంగా ఫిబ్రవరి 26 నుండి ప్రారంభం కానున్నట్లు సమాచారం ఉన్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల షెడ్యూల్‌ను ఖరారు చేయనున్నారు. సుమారు 10 నుండి 15 రోజుల పాటు ఈ సమావేశాలను నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. అంతేకాకుండా.. వివిధ ప్రభుత్వ శాఖల వారీగా నిధుల కేటాయింపులు, ముఖ్యంగా సాగునీటి ప్రాజెక్టులు, విద్య, వైద్య రంగాలకు ఇవ్వాల్సిన ప్రాధాన్యతపై చర్చించనున్నారు. వీటితో పాటు.. ఎన్నికల హామీలైన ఆరు గ్యారంటీల అమలుకు సంబంధించి బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించే అవకాశం ఉంది. మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి వంటి పథకాలకు అవసరమైన ఆర్థిక వెసులుబాటుపై కేబినెట్ తుది నిర్ణయం తీసుకోనుంది. రాష్ట్రంలో కొత్తగా అమలు చేయాలని భావిస్తున్న కొన్ని సంక్షేమ పథకాలపై కూడా ఈ సమావేశంలో స్పష్టత వచ్చే ఛాన్స్ ఉంది. గత బడ్జెట్ కంటే ఈసారి కేటాయింపులు మరింత వాస్తవిక దృక్పథంతో, ప్రజల అవసరాలకు అనుగుణంగా ఉండేలా ఆర్థిక శాఖ కసరత్తు చేస్తోంది. కేంద్రం నుండి రావాల్సిన నిధులు, రాష్ట్ర స్వంత ఆదాయ వనరులపై కూడా మంత్రులు సమీక్షించనున్నారు. ఇప్పటికే డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్ని శాఖల అధికారులతో వరుస సమావేశాలు నిర్వహించి బడ్జెట్ ప్రతిపాదనలను సిద్ధం చేశారు. కేబినెట్ ఆమోదం పొందిన తర్వాత, ఫిబ్రవరి చివరి వారంలో లేదా మార్చి మొదటి వారంలో బడ్జెట్‌ను శాసనసభలో ప్రవేశపెట్టే అవకాశం ఉంది.

# లైఫ్ సైన్సెస్ కేరాఫ్ హైదరాబాద్

మొదటి పేజీ తరువాయి

స్థాయిలో తన ముద్ర వేసిందని సీఎం తెలిపారు. గడిచిన రెండేళ్లలో లైఫ్ సైన్సెస్ రంగంలో ఏకంగా 73 వేల కోట్ల రూపాయల పెట్టుబడులు రావడం తెలంగాణ పారిశ్రామిక శక్తికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ప్రపంచ వ్యాక్సిన్ల ఉత్పత్తిలో హైదరాబాద్ 'గ్లోబల్ వ్యాక్సిన్ మ్యానుఫాక్చరింగ్ హబ్'గా నిలుస్తోందని కొనియాడారు. దేశం 2047 నాటికి వికసిత భారత్ వైపు వెళ్తున్న తరుణంలో, తెలంగాణ కూడా 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగడమే లక్ష్యంగా 'తెలంగాణ రైజింగ్' నినాదంతో ముందుకు వెళ్తున్నామని సీఎం వెల్లడించారు. ప్రపంచస్థాయి గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్స్‌కు హైదరాబాద్ ఇప్పుడు కేరాఫ్ అడ్రస్‌గా మారిందని గుర్తుచేశారు. హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చిన రేవంత్ రెడ్డి, వారికి పూర్తి భరోసా కల్పించారు. "హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టే ప్రతి రూపాయికి, ప్రతి పరిశ్రమకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత మా ప్రభుత్వం తీసుకుంటుంది. మా వద్ద ప్రతిభావంతమైన మానవ వనరులు, ప్రముఖ విద్యాసంస్థలు అందుబాటులో ఉన్నాయి. ముందస్తు విజన్, పటిష్టమైన పాలసీలతో మేము ముందుకు సాగుతున్నాం' అని సీఎం స్పష్టం చేశారు.

# సిద్ధార్థ్ రెడ్డి లొంగిపో!

మొదటి పేజీ తరువాయి

హీరోయిన్‌గా స్టార్‌డమ్ తెచ్చుకుంది. కెరీర్ పీక్‌లో ఉన్న సమయంలో ఆమె అకాల మరణం సినీ ప్రపంచాన్ని కుదిపేసింది. రెండు దశాబ్దాలకుపైగా న్యాయపోరాటం కొనసాగిన ఈ కేసులో తాజాగా సుప్రీంకోర్టు తుది తీర్పు వెలువరించడం గమనార్హం. ప్రత్యూష, సిద్ధార్థరెడ్డి హైదరాబాద్‌లో ఇంటర్ చదువుతున్నప్పుడు ప్రేమించుకున్నారు. ఇంటర్ పూర్తయిన అనంతరం ప్రత్యూష సినిమాల్లోకి వెళ్లగా, సిద్ధార్థరెడ్డి ఇంజినీరింగ్‌లో చేరాడు. తొలినాళ్లలోనే వరుస అవకాశాలు అందుకుంటూ ఆమె దూసుకుపోయింది. అయితే 2002 ఫిబ్రవరి 23న సాయంత్రం ప్రత్యూష, సిద్ధార్థ్ రెడ్డి పురుగుల మందు తాగగా ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రత్యూష మరుసటిరోజు చనిపోయింది. సిద్ధార్థ్ రెడ్డి కోలుకుని మార్చి 9న డిశ్చార్జి అయ్యాడు. వారు కూల్‌డ్రింక్‌లో పురుగుమందు కలిపి తాగినట్లు వైద్యులు గుర్తించారు. ఆర్గానోఫాస్ఫేట్ కారణంగా ప్రత్యూష మరణించారని, ఊపిరాడకుండా చేయడం, మరణానికి ముందు ఆమెపై లైంగిక దాడి వంటివి జరగలేదని రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ముగ్గురు వైద్యుల బృందం నివేదిక ఇచ్చింది. తమ ప్రేమని పెద్దలు అంగీకరించకపోవడం వల్లే ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు సిద్ధార్థ్ రెడ్డి చెప్పారు. అయితే ప్రత్యూష తల్లి సరోజిని అప్పట్లో వెల్లడించిన వివరాలు కేసుకు కీలకంగా మారాయి. బ్యూటీ పార్లర్ నుంచి బయటకు వెళ్లిన అనంతరం కూతురు చేసిన చివరి ఫోన్ కాల్ గురించి ఆమె గుర్తుచేసుకున్నారు. ఆ తర్వాత జరిగిన పరిణామాలు మిస్టరీగా మారాయని తెలిపారు. పోస్ట్‌మార్టమ్ సందర్భంగా గొంతు వద్ద కనిపించిన గాయాలపై కూడా అనేక అనుమానాలు వ్యక్తమయ్యాయి. అయితే వైద్యుల నివేదిక ప్రకారం లైంగిక దాడి జరగలేదని స్పష్టమైంది. అయినప్పటికీ, తన కూతురు మరణానికి సిద్ధార్థ్ రెడ్డే కారణమని ఆమె తల్లి న్యాయపోరాటం కొనసాగించారు. తన కూతురి ఆత్మహత్యకు సిద్ధార్థ్‌రెడ్డే కారణమని ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదుచేశారు. దర్యాప్తు అనంతరం ప్రత్యూష ఆత్మహత్య చేసుకునేలా సిద్ధార్థ్ రెడ్డే ప్రేరేపించారని నిర్ధారిస్తూ ఆయనపై పోలీసులు ఛార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసు విచారణ వివిధ దశల్లో కొనసాగగా హైకోర్టు సిద్ధార్థ్ రెడ్డిని దోషిగా నిర్ధారిస్తూ జైలు శిక్ష విధించింది. అయితే దాన్ని సవాల్ చేస్తూ ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తాజాగా హైకోర్టు తీర్పును సమర్థిస్తూ సుప్రీంకోర్టు అతడి పిటిషన్‌ను కొట్టివేసింది.

# 'స్టే'తో ఎంజాయ్ చేశారు!

ముందు పొరపాటున వేరే కేసుగా భావించి స్టే ఇచ్చామని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అప్పుడు పొరపాటుగా ఇచ్చిన స్టేను నిందితులు ఎంజాయ్ చేశారని.. ఇప్పుడు ఆ పొరపాటును సవరిస్తున్నామన్నారు. అలాగే ఈ కేసుకు సంబంధించి ట్రయల్ కోర్టులో విచారణ కొనసాగించాలని ఆదేశించింది.ఓఎంసీ కేసులో క్యాప్టివ్ మైనింగ్ అనే పదాన్ని తొలగించి అక్రమాలు చేశారని సీబీఐ వాదనలు వినిపించింది. ఈ వ్యవహారంలో శ్రీలక్ష్మి కీలకంగా వ్యవహరించారని.. అలాగే ఆమె మరిది భారీగా అక్రమాస్తులు కూడబెట్టుకున్నారని కోర్టుకు తెలిపారు. సీబీఐ వాదనల తర్వాత సుప్రీం కోర్టు తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సమర్థించింది. సీనియర్ ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మి . గాలిజనార్ధన్‌రెడ్డికి చెందిన ఓబుళాపురం మైనింగ్ కంపెనీకి గనుల కేటాయింపు కేసులో ఆరోపణలు ఎదుర్కొన్నారు.. ఆమె జైలు జీవితాన్ని కూడా గడిపారు. ఆమె తెలంగాణ కేడర్‌లో కొనసాగి.. ఆ తర్వాత ఏపీ కేడర్‌కు వచ్చిన సంగతి తెలిసిందే. అయితే ఓఎంసీ కేసులో తన పేరును తొలగించాలని దాఖలు చేసిన డిశ్చార్జ్ పిటిషన్‌ను సుప్రీం కోర్టు కొట్టేసింది. 2009లో గాలిజనార్ధన్ రెడ్డికి సంబంధించిన ఓబుళాపురం మైనింగ్ కంపెనీ ఆక్రమణలు, అక్రమ మైనింగ్‌పై అప్పటి ఏపీ ప్రభుత్వం విజ్ఞప్తితో కేంద్రం సీబీఐ దర్యాప్తునకు ఆదేశించగా కేసు నమోదైంది. సీబీఐ 2011లో తొలి ఛార్జ్‌షీట్‌ను దాఖలు చేసింది. ఈ కేసులో గాలి జనార్దన్‌రెడ్డితో పాటూ పీఏ మెహఫజ్ అలీఖాన్, అప్పటి మంత్రి సబితా ఇంద్రారెడ్డి, వీడీ రాజగోపాల్, కృపానందం, బీవీ శ్రీనివాసరెడ్డి పేర్లు చేర్చిన సంగతి తెలిసిందే. 2022లో తెలంగాణ హైకోర్టు ఓఎంసీ కేసులో ఏ6గా ఉన్న శ్రీలక్ష్మిని డిశ్చార్జి చేసింది. ఈ కేసు విచారణ సుదీర్ఘంగా సాగింది.. గతేడాది హైదరాబాద్లోని నాంపల్లి సీబీఐ కోర్టు తుది తీర్పు వెల్లడించింది. సీబీఐ కోర్టు ఈ ఓఎంసీ కేసులో గాలి జనార్దన్‌రెడ్డిని దోషిగా తేల్చింది. ఏడేళ్ల జైలుశిక్ష విధించింది.

# ఏఐ సూపర్ పవర్‌గా భారత్

మొదటి పేజీ తరువాయి

అయి ఉండాలి. సాంకేతికత మానవాళికి సేవ చేయడానికి ఉనికిలో ఉంది, వారిని భర్తీ చేయడానికి కాదు. ఈ సమ్మిట్ ప్రజలు, ప్లానెట్, పురోగతి అనే అంశాల చుట్టూ రూపొందించారు. ఏఐ వ్యవస్థలు ప్రపంచవ్యాప్తంగా ఉన్న సమాజాల నుంచి ఉత్పత్తి అయిన జ్ఞానం, డేటాపై ఆధారపడతాయి. కాబట్టి, ఏఐ ప్రయోజనాలు అందరికీ అందాలి. ముందుగా స్వీకరించిన వారి వద్దే నిలిచిపోకూడదు. గ్లోబల్ సౌత్‌లో జరుగుతున్న మొట్టమొదటి గ్లోబల్ ఏఐ సమ్మిట్‌గా, అణగారిన వర్గాల గొంతుకలను, అభివృద్ధి ప్రాధాన్యతలను వినిపించే వేదికను భారత్ సృష్టిస్తోంది. ఏఐ గవర్నెన్స్, సమ్మిళిత డేటాసెట్లు, వాతావరణ అనువర్తనాలు, వ్యవసాయ ఉత్పాదకత, ప్రజారోగ్యం, బహుభాషా ప్రాప్యత వంటివి మాకు అప్రధానమైన అంశాలు కావు. అవి మాకు కేంద్ర బిందువులు. మా విజన్ స్పష్టంగా ఉంది. ఏఐ ప్రపంచ అభివృద్ధిని వేగవంతం చేయాలి, అదే సమయంలో అది పూర్తిగా మానవ-కేంద్రీకృతంగా ఉండాలి. వికసిత్ భారత్ 2047 దిశగా సాగుతున్న భారత ప్రయాణంలో ఏఐ ఒక విప్లవాత్మక అవకాశాన్ని సూచిస్తుంది. ఏఐని వ్యూహాత్మకంగా, జాగ్రత్తగా వినియోగించుకోవడం ద్వారా లోతైన అభివృద్ధి సవాళ్లను పరిష్కరించవచ్చు. అదే సమయంలో పూర్తిగా కొత్త ఆర్థిక అవకాశాలను సృష్టించవచ్చు, సమ్మిళిత వృద్ధిని సాధించవచ్చు. పట్టణ-గ్రామీణ అంతరాన్ని తగ్గించవచ్చు. అవకాశాలను విస్తృతం చేయవచ్చు. ఆరోగ్య సంరక్షణలో ఏఐ ఇప్పటికే ప్రభావాన్ని చూపుతోంది. వేలాది గ్రామాల్లోని 36 లక్షల మంది మహిళా పాడి రైతులను చేరుకోవడానికి అమూల్ ఏఐని ఉపయోగిస్తోంది. పశువుల ఆరోగ్యం, ఉత్పాదకతపై గుజరాతీలో నిజ-సమయ మార్గదర్శకత్వాన్ని అందిస్తూ, క్షేత్రస్థాయి మహిళా ఉత్పత్తిదారులకు సాధికారత కల్పిస్తోంది. వ్యవసాయంలో, పంటల సలహాలు, నేల విశ్లేషణ, వాతావరణ సమాచారంలో ఏఐని ఏకీకృతం చేయడానికి 'భారత్ విస్తార్' చొరవ లక్ష్యంగా పెట్టుకుంది. ప్రతి గ్రామానికి, ప్రతి జిల్లాకు, ప్రతి పౌరుడికి ఆరోగ్యం, విద్య, ఆర్థిక అవకాశాలను అందించడానికి మేము దీనిని సమర్థ సాధనంగా మారుస్తున్నాం. ఏఐలోని పక్షపాతం, పరిమితులకు సంబంధించిన ఆందోళనలు ఇప్పటికీ లోతుగా ఉన్నాయి. ఏఐ వాడకం పెరిగేకొద్దీ ప్రమాదాలు కూడా పెరుగుతాయి. ఏఐ వ్యవస్థలు లింగం, భాష, సామాజిక-ఆర్థిక నేపథ్యానికి సంబంధించిన పక్షపాతాలను అనుకోకుండానే కొనసాగించవచ్చు. 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026' వివిధ భాగస్వాములను ఒకచోట చేర్చుతోంది. ఏఐ పక్షపాతాలు, పరిమితులు వంటి విషయాలపై ప్రపంచవ్యాప్తంగా అవగాహన కల్పిస్తోంది. దీనికి ప్రపంచ సహకారం అవసరం. భారతదేశం విషయానికి వస్తే, మేము ప్రత్యేకమైన సవాళ్లను, అవకాశాలను ఎదుర్కొంటున్నాము. మన వైవిధ్యం - భాషా, సాంస్కృతిక, ప్రాంతీయ పరంగా, పాశ్చాత్య సందర్భాల్లో స్పష్టంగా కనిపించని విధంగా ఇక్కడ ఏఐ పక్షపాతం బయటపడవచ్చు. ప్రధానంగా ఇంగ్లీష్ డేటా లేదా పట్టణ సందర్భాలపై శిక్షణ పొందిన ఏఐ వ్యవస్థ, గ్రామీణ వినియోగదారులు లేదా ప్రాంతీయ భాషలు మాట్లాడే వారికి సరిగ్గా పనిచేయకపోవచ్చు. సానుకూల పరిణామం ఏమిటంటే, భారత్ దీనిని మరింత క్రమబద్ధంగా పరిష్కరించడం ప్రారంభించింది. మన వ్యవస్థలు 140 కోట్ల మంది ప్రజలకు, వారి సామాజిక-ఆర్థిక స్థితి, అక్షరాస్యత స్థాయి, ప్రాంతం లేదా భాషతో సంబంధం లేకుండా పని చేస్తాయి. ఈ పునాదిపై ఏఐని జోడించినప్పుడు, పరిపాలన మరింత వేగంగా, సమర్థంగా మారుతుంది. ఏఐ సంక్షేమ పథకాల లక్ష్యాలను మెరుగుపరచగలదు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారే భారతదేశ ప్రయాణాన్ని వేగవంతం చేసే ఏఐ కావాలి. అలాగే గ్లోబల్ సౌత్‌కు స్కేల్ చేయగల నమూనాను అందించాలి. ఏఐ వినియోగదారుడిగానే కాకుండా, సృష్టికర్తగా కూడా ఏఐ పవర్‌హౌస్‌గా మారడానికి భారతదేశానికి కావలసిన ప్రతిభ, వ్యవస్థాపక శక్తి ఉంది. కేంద్ర బడ్జెట్ 2026-27 ఈ విజన్‌ను బలపరుస్తుంది. ఇది డేటా సెంటర్లు, క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు మద్దతును విస్తరిస్తుంది, దేశీయ కంప్యూట్ సామర్థ్యాన్ని బలపరుస్తుంది.







# కేసీఆర్‌ది తెలంగాణ జాతి

## నీది తెలంగాణ ద్రోహుల జాతి.. సీఎం రేవంత్‌పై కేటీఆర్ నిప్పులు

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఈవార్తలు): బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఉద్దేశించి కొంతమంది విమర్శలు గుప్పిస్తున్నారని, ఆయన ఏ జాతికి జాతిపిత అని ఎద్దేవా చేస్తున్నారని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమది రాణీ రుద్రమ, సమ్మక్క సారక్క, దొడ్డి కొమురయ్య వంటి తెలంగాణ మహాపురుషుల జాతి అని ఆయన అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేసీఆర్ పుట్టిన రోజు శుభాకాంక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, తాము ప్రతిపక్షంలోకి వచ్చాక కేసీఆర్‌ను తూలనాడుతూ కొంతమంది వ్యాఖ్యలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ జాతి గురించి అడుగుతున్నారని, కానీ తెలంగాణ మట్టితో మమేకమైన వారికి, ఉద్యమాల ఉగ్గుపాలు తాగిన వారికి, ఆత్మగౌరవ పోరాటంలో కలిసి నడిచిన వారికి మాత్రమే జాతి అంటే ఏమిటో తెలుస్తుందని అన్నారు. కానీ సమైక్యాంధ్ర సంచులు మోసిన వారికి జాతి గురించి ఏం తెలుస్తుందని అన్నారు. ఇటీవల ఓ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, కేసీఆర్‌ది ఏ జాతి, ఎవరికి జాతిపిత అంటూ వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. తెలంగాణలో తెలంగాణ వాదుల జాతి, తెలంగాణ ద్రోహుల జాతులు ఉన్నాయని అన్నారు. "సమైక్యాంధ్రవాదుల సంచులు మోసే సన్నాసులకు జాతి తెలియదు. నీతి తెలియదు. లాఠీ దెబ్బలు తిన్నవారికి, జైళ్లకు వెళ్లిన వారికి, తుపాకీలకు ఎదురొడ్డి నిలబడ్డ వారికి జాతి అంటే, జాతి అస్థిత్వం అంటే ఏమిటో తెలుసు. ఉద్యమకారుల పైకి తుపాకులు తీసుకెళ్లిన ద్రోహులకు జాతి నిర్వచనం ఎలా తెలుస్తుంది. రక్తంలో పౌరుషం ఉంటే, డీఎన్ఏలో ఉద్యమం ఉంటే ఆత్మాభిమానం అనేది ఎక్కడైనా నీ శరీరంలో ఉంటే నీకు జాతి అంటే ఏమిటో, జాతి చరిత్ర అంటే ఏమిటో తెలుస్తుంది. కానీ జై తెలంగాణ నినాదం ఇవ్వడానికే భయపడేవారికి, తెలంగాణ సోయిలేని సన్నాసులకు జాతి విలువ ఎన్నటికీ తెలియదు" అని కేటీఆర్ ధ్వజమెత్తారు. "కొందరు అడుగుతున్నారు నీది ఏ జాతి అని. ఏ జాతికి జాతి పిత అని అడుగుతున్నారు. వారికి నేను సమాధానం చెబుతున్నాను. ఏ జాతి అనే అల్పుడికి నేను చెబుతున్నాను. రాజ్యతంత్రం నడిపిన రుద్రమ జాతి మాది. జల్ జంగల్ జమీన్ అని కొట్లాడిన కొమురంభీం, అస్తిత్వం కోసం అమరులైన సమ్మక్క, సారక్క, కోటల మీద జెండా ఎగురవేసిన బహుజన వీరుడు సర్దార్ సర్వాయిపాపన్న, భూస్వాముల దోపిడి మీద కొట్లాడిన దొడ్డి కొమురయ్య, బరిలో బందూకు పట్టి దేశ్‌ముఖ్‌లను తరిమికొట్టిన వీరనారి చాకలి ఐలమ్మ, సామాజిక విప్లవకారుడు భాగ్యరెడ్డి వర్మ, సిపాయిల తిరుగుబాటు బావుటా ఎగురవేసిన తుర్రెబాజ్ ఖాన్, ప్రాంతం వాడు మోసం చేస్తే ప్రాంతంలోనే ఉప్పుపాతర వేస్తామన్న కాళోజీ, నా తెలంగాణ కోటి రతనాల అన్న దాశరథి, విద్యార్థి అమరవీరుల జాతి మాది" అని కేటీఆర్ ఉద్ఘాటించారు.

# కేసీఆర్‌కు గ్రీన్ సెల్యూట్

**పుట్టినరోజు సందర్భంగా సుందర్బన్స్‌లో ప్రత్యేక కార్యక్రమం**

**గ్రీన్ ఛాలెంజ్‌లో 10,000 మడ అడవుల మొక్కల పెంపకం**

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఈవార్తలు): తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) 72వ జన్మదినం సందర్భంగా ఆయనకు ఒక వినూత్న హరిత కానుక అందింది. ఆయన పర్యావరణ దార్శనికత స్ఫూర్తితో, ప్రపంచంలోనే అత్యంత కీలకమైన పర్యావరణ ప్రాంతాల్లో ఒకటైన సుందర్బన్స్‌లో భారీ మొక్కల పెంపకం కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా, కేసీఆర్ పుట్టినరోజును పురస్కరించుకుని సుందర్బన్స్‌లో 10,000 మడ అడవుల (మాంగ్రూవ్) మొక్కలను నాటారు. భారత్, బంగ్లాదేశ్ సరిహద్దుల్లోని గంగ-బ్రహ్మపుత్ర-మేఘన డెల్టాలో సుమారు 10,000 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న సుందర్బన్స్, ప్రపంచంలోనే అతిపెద్ద మడ అడవుల పర్యావరణ వ్యవస్థగా ప్రసిద్ధి చెందింది. ఈ అడవులు తుపానులు, సముద్రపు అలల తాకిడి, తీర ప్రాంత కోత నుంచి లక్షలాది మందికి సహజ రక్షణ కవచంలా నిలుస్తున్నాయి. అయితే, పెరుగుతున్న సముద్ర మట్టాలు, వాతావరణ మార్పుల కారణంగా ఈ ప్రాంతం తీవ్రమైన ప్రమాదాలను ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో ఇక్కడ మడ అడవులను బలోపేతం చేయడం అత్యవసరంగా మారింది. కేసీఆర్ తెలంగాణలో ప్రారంభించిన 'తెలంగాణకు హరితహారం' కార్యక్రమమే ఈ బృహత్తర ఉద్యమానికి అసలు స్ఫూర్తి. పర్యావరణ పరిరక్షణను ప్రభుత్వ విధానంలో అంతర్భాగం చేసిన కేసీఆర్, హరితహారాన్ని కేవలం మొక్కలు నాటే కార్యక్రమంగా కాకుండా, ఒక ప్రజా ఉద్యమంగా మలిచారు. ఈ స్ఫూర్తితోనే మాజీ రాజ్యసభ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ 'గ్రీన్ ఇండియా ఛాలెంజ్'ను ప్రారంభించి, దానిని దేశవ్యాప్త ఉద్యమంగా మార్చారు. సుందర్బన్స్‌లో చేపట్టిన ఈ కార్యక్రమం కేవలం లాంఛనప్రాయమైనది కాదు. ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని దీనికి జోడించారు. నాటిన మొక్కల మనుగడను పర్యవేక్షించేందుకు జియో-ట్యాగింగ్, వాతావరణ మార్పులను గమనించేందుకు మైక్రో-క్లైమేట్ సెన్సార్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటివి వినియోగిస్తున్నారు. తెలంగాణలో మొదలైన హరిత స్ఫూర్తి, దేశ సరిహద్దుల్లోని సుందర్బన్స్ పరిరక్షణ వరకు విస్తరించడం కేసీఆర్ పర్యావరణ దార్శనికతకు నిదర్శనంగా నిలుస్తోంది.

## ముస్లిం ఉద్యోగులకు గంట ముందు సెలవు

**రంజాన్ సందర్భంగా వెసులుబాటు**

**తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలు ఉత్తర్వులు జారీ**

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఈవార్తలు): రంజాన్ మాసం సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ముస్లిం ఉద్యోగులకు వెసులుబాటు కల్పించింది. విధులకు గంట ముందుగా హాజరయ్యేందుకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ఇదే తరహా నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు మంగళవారం ఒక మెమో జారీ చేశారు. దీని ప్రకారం, ఫిబ్రవరి 19 నుంచి మార్చి 20 వరకు ముస్లిం ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, బోర్డులు/కార్పొరేషన్ల ఉద్యోగులు సాయంత్రం 4 గంటలకు కార్యాలయాల నుంచి వెళ్లిపోవచ్చు. అత్యవసర సేవలు అవసరమైనప్పుడు మినహా ఈ వెసులుబాటు వర్తిస్తుంది. మరోవైపు, తెలంగాణలో ఉర్దూ మీడియం పాఠశాలల సమయాల్లో కూడా మార్పులు చేశారు. ఉర్దూ మీడియం పాఠశాలలు, డైట్ కాలేజీలు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు పనిచేస్తాయి. ఇక ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం ఇప్పటికే ఈ వెసులుబాటు కల్పించింది. ఫిబ్రవరి 18 నుంచి మార్చి 19 వరకు ముస్లిం ఉద్యోగులు గంట ముందుగా వెళ్లేందుకు అనుమతి ఇచ్చింది. ప్రభుత్వ విభాగాలు, గ్రామ/వార్డు సచివాలయాల్లో పనిచేసే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి కూడా ఇది వర్తిస్తుందని మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూఖ్ గతంలోనే తెలిపారు.

## శివుడి ప్రసాదంగా డ్రగ్స్.. సజ్జనార్ సీరియస్

**రంగంలోకి దిగిన పోలీసులు ముగ్గురు అరెస్ట్**

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఈవార్తలు): మహా శివరాత్రి పర్వదినాన శివుడికి మాదకద్రవ్యాలను నైవేద్యంగా పెడుతున్నట్లు చిత్రీకరించి, సోషల్ మీడియాలో రీల్ చేసిన ముగ్గురు యువకులను హైదరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ వీడియో వైరల్ కావడంతో నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలను ఉపేక్షించబోమని, నిందితులపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించిన కొద్ది గంటల్లోనే పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే, మహా శివరాత్రి రోజున కొందరు యువకులు శివుడి విగ్రహం ముందు గంజాయిని ఉంచి, దానిని 'ప్రసాదం' అంటూ ఓ వీడియో రీల్ రూపొందించారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వేగంగా వ్యాప్తి చెందడంతో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ ఘటనపై సీపీ సజ్జనార్ తన 'ఎక్స్' ఖాతా ద్వారా స్పందించారు. "లైక్స్ కోసం లోకాన్ని మరిచి, వ్యూస్ కోసం విలువలను వదిలేస్తారా? ఇది కటకటాల వెనుకకు చేర్చే తీవ్రమైన నేరం. ఇలాంటి చర్యలను ఏమాత్రం సహించం" అని ఆయన తీవ్రంగా హెచ్చరించారు.

## వివేక్ కారుపై రాళ్లదాడి

మంచిర్యాల, ఫిబ్రవరి 17 (ఈవార్తలు): మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎన్నిక సందర్భంగా ఉద్రిక్తత చోటుచేసుకుంది. మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎన్నిక సందర్భంగా అక్కడికి వచ్చిన మంత్రి వివేక్‌ని బీఆర్ఎస్ కార్యకర్తలు అడ్డుకున్నారు. ఆయన కాన్వాయిపై రాళ్లు రువ్వడంతో కారు అద్దాలు ధ్వంసమయ్యాయి. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పరిస్థితులు ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు లాఠీఛార్జ్ చేశారు. రాళ్ల దాడిలో కాంగ్రెస్ కార్యకర్తలకు స్వల్పగాయాలయినట్లు తెలుస్తోంది. ఎన్నికల కేంద్రం వద్ద బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నేతలు పెద్దఎత్తున గూమిగూడారు. అనంతరం పోటాపోటీగా నినాదాలు చేసుకున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కాగా ప్రస్తుతం అక్కడ మున్సిపల్ ఎన్నిక వాయిదా పడ్డట్లు తెలుస్తోంది.

# స్పాట్‌లో సస్పెండ్ చేస్తా

## అధికారులకు సీఎం రేవంత్ వార్నింగ్.. అన్ని జోన్లలో పర్యటిస్తానని స్పష్టీకరణ



హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఈవార్తలు): పురపాలక శాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం కీలక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు, కమిషనర్లు, సిబ్బందిపై సీఎం సీరియస్ అయ్యారు. త్వరలోనే ప్రతి జోన్‌లో వ్యక్తిగతంగా పర్యటించి పరిస్థితులను పరిశీలిస్తానని స్పష్టం చేశారు. రోడ్లు శుభ్రంగా లేకపోతే అక్కడికక్కడే అధికారులపై చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. కమిషనర్లు, జోనల్ కమిషనర్లు ఉదయం నుంచే ఫీల్డ్‌లో ఉండాలని, రోజూ సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. చాలా మంది అధికారులు ఫీల్డ్‌లోకి వెళ్లడం లేదని, అలాంటి వారిని సస్పెండ్ చేస్తానని ముఖ్యమంత్రి వార్నింగ్ ఇచ్చారు. హైదరాబాద్‌తో పాటు మూడు కార్పొరేషన్లలో శానిటేషన్, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. నూతనంగా ఎన్నికైన మేయర్లు, డిప్యూటీ మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. నగరంలో స్మార్ట్ పోల్స్ ఏర్పాటు పైన అధ్యయనం చేయాలన్నారు సీఎం. ట్రాఫిక్ బాగా ఉన్న చోట పీపీపీ విధానంలో స్కై వాక్ బ్రిడ్జిల ఏర్పాటుపై అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. నెక్లెస్ రోడ్ రైల్వే స్టేషన్ సమీపంలో మల్టీలెవల్ కార్ పార్కింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అడ్వర్టైజింగ్ బోర్డుల ఏర్పాటుపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి గండి పడకుండా చర్యలు ఉండాలని సీఎం తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాల కోసం 10 శాతం అడ్వర్టైజింగ్ బోర్డులు కేటాయించాలని ముఖ్యమంత్రి చెప్పారు. అడ్వర్టైజింగ్ బోర్డుల నుంచి సంవత్సరానికి ఒక సారి ఫీజు వసూలు చేయాలని అధికారులకు సూచించారు. అనధికార అడ్వర్టైజింగ్ బోర్డులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరంలో వీధి దీపాల నిర్వహణలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వీధి దీపాల నిర్వహణ విషయంలో యూనికోడ్ ఉండాలన్నారు. జంక్షన్ల వద్ద స్మార్ట్ పోల్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. జీహెచ్ఎంసీ విభజన విషయంలో తలెత్తిన పలు సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనలు చేశారు. ఈ సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంఓ సెక్రటరీ మాణిక్ రాజ్, హెచ్ ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్, బీజేపీ తెలంగాణ వ్యతిరేకులు

మాజీమంత్రి హరీశ్ రావు మండిపాటు

సిద్దిపేట, ఫిబ్రవరి 17 (ఈవార్తలు): కాంగ్రెస్, బీజేపీలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్ర విమర్శలు గుప్పించారు. మున్సిపల్ ఎన్నికల్లో గెలుపు కోసం జెండాలు, అజెండాలు పక్కనపెట్టి దిగజారుడు రాజకీయాలు చేశారని విమర్శించారు. బీజేపీకి బీఆర్ఎస్ పార్టీ బీటీమ్ అంటూ కాంగ్రెస్... కాంగ్రెస్ కు బీఆర్ఎస్ బీటీమ్ అంటూ బీజేపీ.... గత 12 ఏళ్లుగా చేసిన ప్రచారమంతా తప్పుడు ప్రచారమేనని తేలిపోయిందని అన్నారు. ఆ రెండు పార్టీలు తెలంగాణ వ్యతిరేక టీమ్ అని తేలిపోయిందని చెప్పారు. "మార్పు అంటే బీజేపీతో కలవడమా? ఇదేనా మీరు తెస్తానన్న మార్పు?" అని సీఎం రేవంత్ రెడ్డిని సూటిగా ప్రశ్నించారు. ఢిల్లీలో కొట్టుకున్నట్టు నటిస్తూ... గల్లీలో చేతులు కలుపుకుని వాటాలు పంచుకుంటున్నారని ఆరోపించారు. సిర్పూర్ కాగజ్ నగర్, మెట్ పల్లి, అమన్ గల్, అలియాబాద్, నర్సాపూర్ ఫలితాలే దీనికి సాక్ష్యమని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీకి ప్రజల్లో ఉన్న బలాన్ని చూసి భయపడే ఈ రెండు పార్టీలు సిద్ధాంతాలకు తిలోదకాలిచ్చి కుట్రలకు తెరలేపాయని, రాబోయే రోజుల్లో ప్రజలే వీళ్లకు బుద్ధి చెబుతారని హరీశ్ రావు గట్టిగా చెప్పుకొచ్చారు.

## రాజకీయాల్లో ఉండాలో.. వద్దో!

**ఎర్రబెల్లి దయాకర్ రావు కన్నీరు**

తొర్రూరు, ఫిబ్రవరి 17 (ఈవార్తలు): తొర్రూరులో జరిగిన మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక తీరును చూశాక రాజకీయాల్లో ఉండాలా, వద్దా అనేది అర్థం కావడం లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎర్రబెల్లి దయాకర్ రావు కన్నీళ్లు పెట్టుకున్నారు. తొర్రూరులో 16 వార్డులకు గాను 9 బీఆర్ఎస్, 7 కాంగ్రెస్ గెలుచుకున్నాయి. ఎక్స్అఫీషియో ఓట్లతో కలిపి రెండు పార్టీల బలాలు సమానమయ్యాయి. దీంతో లాటరీ తీయడంతో కాంగ్రెస్ రెండో వార్డు కౌన్సిలర్ శ్రావణ్ కుమార్ ఛైర్మన్ అయ్యారు. ఛైర్మన్ ఎన్నిక నేపథ్యంలో తొర్రూరులో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. ఓ సమయంలో ఎర్రబెల్లి దయాకర్ రావుతో పాటు, పలువురు బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం జరిగిన ఎన్నికలో కాంగ్రెస్ మున్సిపాలిటీని దక్కించుకుంది. తొర్రూరు మున్సిపాలిటీని కోల్పోవడంతో ఎర్రబెల్లి దయాకర్ రావు తీవ్ర భావోద్వేగాలకు లోనయ్యారు. రేయింబవళ్లు పార్టీ గెలుపు కోసం కష్టపడిన కార్యకర్తలకు ఏం సమాధానం చెప్పాలని రోదిస్తూ అక్కడున్న పోలీసులను ప్రశ్నించారు. పోలీసుల తీరు సరిగ్గా లేదని అన్నారు. ఇంత అరాచకంగా ఎన్నికలు నిర్వహించడమేమిటని ప్రశ్నించారు. కార్యకర్తలు తెగించి పోరాడారని అన్నారు. పోలీసులు రాజ్యాంగ విరుద్ధంగా పని చేశారని అసహనం వ్యక్తం చేశారు. తన 45 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇంత దగా, మోసం చూడలేదని కన్నీరు పెట్టుకున్నారు.

# 22 నుంచి మూడ్రోజులు వానలు



హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఈవార్తలు): హైదరాబాద్ సహా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో అకాల వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎండ తీవ్రత నెమ్మదిగా పెరుగుతున్న సంగతి తెలిసిందే. అయితే ఇలాంటి తరుణంలో రాష్ట్రంలో మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వార్తలు వెలువడ్డాయి. సోషల్ మీడియా వేదికగా ఖచ్చితమైన వాతావరణ అంచనాలు అందిస్తారనే పేరున్న టీ బాలాజీ ఈ మేరకు వివరాలు వెల్లడించారు. వచ్చేవారం రాష్ట్రంలో వర్షాలు, వడగళ్ల వానల కురిసే అవకాశం ఉందని తెలిపారు. హైదరాబాద్ సహా పలు జిల్లాల్లో వర్షాలు పడతాయని పేర్కొన్నారు. ఈ ఏడాది తొలి అకాల వర్షాలు, ఉరుములు, మెరుపులతో కూడిన వానలకు సిద్ధంగా ఉండాలని తెలంగాణ ప్రజలను అలర్ట్ చేశారు. ఈ నెల 22, 23,24 వర్షాలు కురుస్తాయని అంచనా వేశారు. ఫిబ్రవరి 22న ఆదిలాబాద్ నుంచి జగిత్యాల, మంచిర్యాల మీదుగా ములుగు వరకు ఉత్తర, తూర్పు తెలంగాణలో చెల్లాచెదురుగా వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు. అలాగే, ఫిబ్రవరి 23, 24 తేదీల్లో హైదరాబాద్, వరంగల్, సిద్దిపేట, ఖమ్మం, కరీంనగర్, సూర్యపేట, భద్రాచలంతో సహా మొత్తం మధ్య, తూర్పు, దక్షిణ తెలంగాణలో చెల్లాచెదురుగా వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. కొన్ని చోట్ల వడగళ్ళు పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. కొన్ని చోట్ల 20-40 మి.మీ వర్షపాతం ఉండొచ్చని తెలిపారు. రైతులు వారి పంటను జాగ్రత్తగా చూసుకోవాలని కోరారు. నష్టాలను నివారించేందుకు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంచనాలలో ఏవైనా మార్పులు ఉంటే ఫిబ్రవరి 20న పూర్తి క్లారిటీతో కూడిన అప్‌డేట్ ఇవ్వనున్నట్టుగా తెలిపారు. అయితే హైదరాబాద్ సహా తెలంగాణలో వర్షాలు, వడగళ్ల వానకు సంబంధించి వాతావరణ శాఖ ఎటువంటి హెచ్చరిక జారీ చేయలేదు. రాష్ట్రంలో పొగమంచు, మేఘాలతో కూడిన వాతావరణ పరిస్థితులను అంచనా వేసినప్పటికీ, ఎటువంటి హెచ్చరికను మాత్రం జారీ చేయలేదు. ఫిబ్రవరి 20 వరకు ఉదయం లేదా రాత్రి వేళల్లో పొగమంచు పరిస్థితులు ఉండే అవకాశం ఉందని తెలిపింది.

## 23 మంది విదేశీయుల అరెస్ట్

**హైదరాబాదులో అక్రమంగా నివాసం**

**టోలిచౌకీలో పోలీసుల కార్డన్ సెర్చ్**

టోలిచౌకీ/హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఈవార్తలు): హైదరాబాద్ నగరంలో అక్రమంగా నివసిస్తున్న విదేశీయులపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. గోల్కొండ జోన్ పరిధిలోని టోలిచౌకి పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి భారీ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించి, వీసా గడువు ముగిసినా దేశంలోనే ఉంటున్న 23 మంది విదేశీయులను అదుపులోకి తీసుకున్నారు. గోల్కొండ జోన్ డీసీపీ జి. చంద్రమోహన్ ప్రత్యక్ష పర్యవేక్షణలో సుమారు 250 మంది పోలీసు సిబ్బంది ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. పారామౌంట్ కాలనీ (గేట్లు 1 నుంచి 4), ఐఏఎస్ కాలనీ, హకీంపేట్ కుంట ప్రాంతాల్లో పక్కా సమాచారంతో పోలీసులు ఏకకాలంలో సోదాలు చేపట్టారు. ఫారినర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ (ఎఫ్ఆర్ఆర్ఓ) అధికారుల సహాయంతో ఈ సోదాలు జరిగాయి. వివిధ దేశాలకు చెందిన 23 మంది అక్రమంగా నివసిస్తున్నట్లు గుర్తించారు. వీరి వీసా, పాస్‌పోర్ట్ గడువు ముగిసినట్లు తేలింది. ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని 30 ద్విచక్ర వాహనాలు, అక్రమంగా గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తున్న 9 గ్యాస్ సిలిండర్లు, చట్టవిరుద్ధంగా నిల్వ ఉంచిన 53 మద్యం బాటిళ్లను కూడా స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. ప్రజా భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని, నివాస చట్టాలను కఠినంగా అమలు చేస్తామని డీసీపీ చంద్రమోహన్ స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని ఆయన వివరించారు. కాగా, అదుపులోకి తీసుకున్న విదేశీయులు ఏ దేశస్థులనే వివరాలను పోలీసులు వెల్లడించలేదు. టోలిచౌకి, పారామౌంట్ కాలనీ ప్రాంతాల్లో ఆఫ్రికన్ దేశాలకు చెందిన వారు ఎక్కువగా నివసిస్తుంటారు.

# నల్ల పోచమ్మ ఆలయంలో నవగ్రహ హోమం

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఈవార్తలు): అమావాస్య సందర్భంగా, కోటి రాణి పార్క్ సమీపంలోని నల్ల పోచమ్మ ఆలయంలో మంగళవారం శాంతి, సమాజ శ్రేయస్సు కోసం దైవిక ఆశీస్సులు కోరుతూ పవిత్రమైన నవగ్రహ హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా బజరంగ్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.ఆర్. లక్ష్మణ్ రావు, ఆలయ కమిటీతో కలిసి, ఆలయంలో ఉన్న భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ప్రభు బిరాదార్, గోవర్ధన్ లాల్, సునీల్, రవి కుమార్, ప్రవీణ్ యాదవ్, రామేశ్వర్ మిశ్రా, వీరేందర్ అవస్థి, నరేష్, ప్రముఖ సభ్యులు భక్తులు ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. భక్తులు, సమాజ సభ్యుల చురుకైన భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం భక్తి వాతావరణంలో జరిగింది.



# కేసీఆర్ జన్మదిన వేడుకల్లో నవీన్ పటేల్

జూబ్లీహిల్స్/హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే మాగంటి సునీత గోపీనాథ్ ఆధ్వర్యంలో వారి క్యాంపు కార్యాలయంలో కేసీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. సర్వమత ప్రార్థనలు చేసి కేసీఆర్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండి, త్వరలో మళ్లీ తెలంగాణ సీఎం కావాలని బీఆర్ఎస్ సీనియర్ నేత నవీన్ పటేల్ ఆకాంక్షించారు. కేక్ కట్ చేసి, చీరలు, పండ్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కేసీఆర్ కటౌట్ ముందు కార్యకర్తలు సెల్ఫీలు దిగి సందడి చేశారు. కార్యక్రమంలో నాగరాజు, ప్రసాద్ చౌదరి, సాయితేజ, రామకృష్ణ, అనికేత్, పూర్ణచందర్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.



# మెదక్ కలెక్టర్‌కు ఆర్నెల్ల జైలు

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఈవార్తలు): కోర్టు ఆదేశాలను ధిక్కరించినందుకు మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌కు జైలు శిక్ష పడింది. ఉద్దేశపూర్వకంగా కోర్టు ధిక్కరణకు పాల్పడినందున ఆయనకు హైకోర్టు 6 నెలల జైలు శిక్ష, రూ. 2 వేల జరిమానా విధించింది. మంగళవారం విచారణ అనంతరం కలెక్టర్‌కు జైలు శిక్ష విధిస్తున్నట్టు హైకోర్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. అప్పీలు సుకోవడానికి కలెక్టర్‌కు 4 వారాల గడువు ఇచ్చింది. బోనాల్ గ్రామవాసి లక్ష్మీ వేసిన పిటిషన్‌పై మంగళవారం హైకోర్టు విచారణ చేపట్టింది. భూ వివాదంలో కోర్టు ఆదేశాలను కలెక్టర్ పట్టించుకోలేదని ఆమె పిటిషన్ వేసింది. లక్ష్మి పిటిషన్‌పై విచారించిన హైకోర్టు.. కలెక్టర్ రాహుల్ రాజ్ తీరును తప్పుపట్టింది. కోర్టు ఆదేశాను ధిక్కరించినందుకు ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ.2 వేల జరిమానా వేసింది. అప్పీల్‌కు నాలుగు వారాల గడువు ఇచ్చిన హైకోర్టు.. తీర్పు అమలును నాలుగు వారాలు వాయిదా వేస్తున్నట్టు చెప్పింది.

# అసెంబ్లీకి రాకపోతే చర్యలు

**ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు**

అమరావతి, ఫిబ్రవరి 17 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు ఈరోజు గంట ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. దీనిపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు మీడియాతో మాట్లాడుతూ... సాఫ్ట్ వేర్ సమస్యే దీనికి కారణమని చెప్పారు. టెక్నికల్ సమస్య వచ్చినప్పుడు ఎవరూ ఏమీ చేయలేరని అన్నారు. వైసీపీ వాళ్లు ఎలాంటి రాజకీయమైనా చేస్తారని... గతంలో ఫేస్ టు ఫేస్ రాజకీయాలు ఉండేవని... ఇప్పుడు వైసీపీ వాళ్లు వెనక నుంచి గుంతలు తవ్వే రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. సభకు హాజరుకాని వైసీపీ సభ్యుల గురించి మాట్లాడుతూ ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీకి రాని ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత విధులను సక్రమంగా నిర్వహించని ఎమ్మెల్యేలను ప్రజలు రీకాల్ చేయాలని అన్నారు. సభకు రాకుండా జీతభత్యాలు తీసుకోవడం సరికాదని చెప్పారు. విధులకు హాజరుకాని ఉద్యోగులకు జీతం కట్ చేస్తారని... ఆ నిబంధన ఎమ్మెల్యేలకు ఎందుకు వర్తించదని ప్రశ్నించారు. చాలా దేశాల్లో రీకాల్ విధానం ఉందని... మనది ప్రజాస్వామ్య దేశం కావడంతో ఇలాంటి పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తోందని అన్నారు. డిజిటల్ అటెండెన్స్ వ్యవస్థ అద్భుతంగా పనిచేస్తోందని స్పీకర్ తెలిపారు. సభ్యులు అసెంబ్లీకి రావడమే కాదు... సభలో ఎన్ని గంటలు, నిమిషాలు కూర్చున్నారో కూడా ఈ వ్యవస్థ ద్వారా నమోదవుతోందని తెలిపారు.

# నెయ్యి కొనుగోలుకు టీటీడీ 7 విడతల టెండర్లు

**రవాణా ట్యాంకర్లకు జీపీఎస్ లాక్, కఠిన నాణ్యత పరీక్షలు తప్పనిసరి**

తిరుమల, ఫిబ్రవరి 17 (ఈవార్తలు): తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో వినియోగించే ఆవు నెయ్యి కొనుగోలు ప్రక్రియలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. లడ్డూ నాణ్యత, స్వచ్ఛత విషయంలో భక్తుల నమ్మకాన్ని నిలబెట్టేలా, పారదర్శకతకు పెద్దపీట వేస్తూ కొత్త విధానాన్ని అమలులోకి తెచ్చింది. చైర్మన్ బీఆర్ నాయుడు నేతృత్వంలోని నూతన టీటీడీ బోర్డు ఈ మేరకు కీలక నిర్ణయాలు తీసుకుంది. గతంలో, అంటే 2024కు ముందు, శ్రీవారి లడ్డూ ప్రసాదం నాణ్యత, రుచిపై భక్తుల నుంచి కొన్ని విమర్శలు, అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో స్పందించిన టీటీడీ, నెయ్యి కొనుగోలు విధానాన్ని సమూలంగా మార్చాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా పలు కఠిన నిబంధనలను ప్రవేశపెట్టింది. నెయ్యి నాణ్యత రవాణా సమయంలో దెబ్బతినకుండా ఉండేందుకు, సేకరణ భౌగోళిక పరిధిని గతంలో ఉన్న 1500 కిలోమీటర్ల నుంచి 800 కిలోమీటర్లకు తగ్గించారు. నెయ్యిని సరఫరా చేసే ట్యాంకర్లకు తప్పనిసరిగా జీపీఎస్ లాక్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసి, రవాణాను నిరంతరం పర్యవేక్షించేలా చర్యలు తీసుకున్నారు.

## టెండర్ల వివరాలు ఇలా..

1. నందిని – 4 టెండర్లు దక్కించుకుంది
2. మదర్ డైరీ – 2 టెండర్లు దక్కించుకుంది
3. ఇందాపూర్ డైరీ – 2 టెండర్లు దక్కించుకుంది
4. సంగం డైరీ – 1 టెండర్ దక్కించుకుంది
5. ప్రీమియర్ అగ్రి డైరీ – టెండర్ దక్కించుకోలేదు
6. కొల్హాపూర్ డైరీ (గోకుల్) – టెండర్ దక్కించుకోలేదు
7. గోవింద్ మిల్క్ – టెండర్ దక్కించుకోలేదు

# విశాఖకు రాష్ట్రపతి ముర్ము

**స్వాగతం పలికిన గవర్నర్, పవన్**

**నేడు యుద్ధనౌకల సమీక్ష**

వైజాగ్, ఫిబ్రవరి 17 (ఈవార్తలు): భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం సాయంత్రం విశాఖపట్నం చేరుకున్నారు. నగరంలోని ఐఎన్ఎస్ డేగా నౌకాదళ విమానాశ్రయానికి ప్రత్యేక విమానంలో వచ్చిన ఆమెకు రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, రాష్ట్ర మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి సాదరంగా స్వాగతం పలికారు. ఎంపీ శ్రీభరత్, మేయర్ పీలా శ్రీనివాస్, ఉన్నతాధికారులు కూడా రాష్ట్రపతిని ఆహ్వానించిన వారిలో ఉన్నారు. బుధవారం విశాఖ తీరంలో జరగనున్న ప్రతిష్ఠాత్మక 'అంతర్జాతీయ యుద్ధనౌకల సమీక్ష-2026'కు రాష్ట్రపతి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. భారత సాయుధ దళాల సుప్రీం కమాండర్‌గా ఆమె ఈ సమీక్షను పర్యవేక్షిస్తారు. ఈ కార్యక్రమంలో భారత నౌకాదళంతో పాటు పలు విదేశీ యుద్ధనౌకలు కూడా పాల్గొంటాయి. ఈ పర్యటనలో భాగంగా, ఫిబ్రవరి 19న జరిగే 'మిలన్ అంతర్జాతీయ సిటీ పరేడ్', 20న నిర్వహించే 'కాన్‌క్లేవ్ ఆఫ్ చీఫ్స్' కార్యక్రమాల్లో కూడా రాష్ట్రపతి పాల్గొంటారు. ఆమె పర్యటన నేపథ్యంలో విశాఖ నగరంలో పోలీసులు, నౌకాదళ అధికారులు పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈ అంతర్జాతీయ ఈవెంట్, భారత నౌకాదళ శక్తిసామర్థ్యాలను ప్రదర్శించడంతో పాటు, మిత్రదేశాలతో సంబంధాలను బలోపేతం చేయడానికి ఉపయోగపడుతుందని భావిస్తున్నారు.

# గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై పరిశీలన

**పుష్కరఘాట్లను పరిశీలించిన జగిత్యాల కలెక్టర్**

జగిత్యాల బ్యూరో, ఫిబ్రవరి 17 (ఈవార్తలు): గోదావరి నది తీరంలోని ధర్మపురి, రాయపట్నం మరియు కోటిలింగాల పుష్కర ఘాట్లను జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ పరిశీలించారు. 2027లో జులై 23వ తేదీ నుంచి ప్రారంభం కానున్న గోదావరి పుష్కరాలకు వ్యవధి ఉన్నందున శాశ్వతమైన మౌలిక వసతులు, రోడ్లు, ఘాట్లు, విద్యుత్ మరియు అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అలాగే ధర్మపురి పట్టణానికి మరియు కోటిలింగాల ఆలయాలకు ప్రత్యేక మాస్టర్ ప్లాన్ రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రవేశించే గోదావరి నది తీరం వెంట ప్రాంతాల్లో పుష్కర ఘాట్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంటుందని, లింక్ రోడ్లు ఏర్పాట్లు, అవసరమైన చోట ఘాట్ల నిర్మాణం చేయాలని అధికారులకు వివరించారు. పుష్కర స్నానాలకు వీలుగా ఉండే గోదావరి తీర ప్రాంతాలను అభివృద్ధి చేయాలని అందుకు తగిన ప్రణాళికలు ముందస్తుగా ఏర్పాటు



చేయాలని తెలిపారు. ఒకే రోజు రెండు లక్షల పైన భక్తులు పుష్కర ఘాట్లకు తరలివచ్చినా ఇబ్బంది లేకుండా రోడ్లు, రహదారుల నిర్మాణంతో పాటు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా వాహనాల పార్కింగ్, తాగు నీరు, స్నానాల ఘాట్లతో పాటు భక్తులకు అవసరమైన వసతి సదుపాయాలన్నీ ఉండేలా ప్లాన్ చేయాలని తెలిపారు. పుష్కరాల ఏర్పాట్లకు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్వచ్ఛ భారత్, జల్ జీవన్ మిషన్‌తో పాటు అందుబాటులో ఉన్న కేంద్ర పథకాలన్నింటితో సమన్వయం ఉండే పనులు గుర్తించి, వాటికి అవసరమైన అనుమతులు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో పుష్కరాలకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పనుల జాబితాను సిద్ధం చేయాలని వెల్లడించారు. ధర్మపురి పట్టణంలోని గోదావరి నది మరియు గోదావరి నది ప్రాంత ఘాట్లను పుష్కర ప్రాంతాలను, రాయపట్నం మరియు కోటిలింగాల పుష్కర ఘాట్లను, పరిశీలించారు. పుష్కరాల నిర్వహణకు ముందస్తు ఏర్పాట్లలో వైద్య ఆరోగ్య శాఖ,పర్యాటక, పోలీసు శాఖ,నీటి పారుదల, దేవాదాయ శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్, ఆర్డీవో, ఈఈలు, డీఈలు ధర్మపురి టెంపుల్ ఈవో, ఎమ్మార్వోలు, మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవోలు, ఏఈలు సంబంధిత అధికారులు ఉన్నారు.

# హత్య కేసులో నిందితుల అరెస్ట్

జగిత్యాల బ్యూరో, ఫిబ్రవరి 17 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలోని సాయిరాం నగర్ బైపాస్ రోడ్డులో ఈ నెల 15న జరిగిన హత్య కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. జగిత్యాల రూరల్ మండలం పోరండ్ల గ్రామానికి చెందిన బోరె విశ్వనాథ్ (30)కు మేడిపల్లి మండలం పొరుమల్ల గ్రామానికి చెందిన ఓ వివాహిత మహిళతో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం వివాహేతర సంబంధంగా మారడంతో ఇద్దరూ జగిత్యాల పట్టణంలోని సాయిరాం నగర్ బైపాస్ రోడ్డులో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఈ విషయాన్ని మనసులో పెట్టుకున్న మహిళ భర్త ఆలకుంట గంగాధర్ (32) తన బావమరిది బోదసు తిరుపతి (41)తో కలిసి విశ్వనాథ్‌ను హత్య చేయాలని పథకం రచించాడు. ఘటన రోజు మధ్యాహ్నం సమయంలో బైపాస్ రోడ్డులో నడుచుకుంటూ వెళ్తున్న విశ్వనాథ్‌పై వెనుక నుంచి కర్రతో తలపై దాడి చేశారు. తీవ్రంగా గాయపడ్డ విశ్వనాథ్ కుప్పకూలగా, మహిళపై కూడా దాడి చేయడంతో ఆమె గాయాలతో అక్కడి నుంచి



తప్పించుకుంది. స్థానికులు విశ్వనాథ్‌ను వెంటనే ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి బోరె చంద్రయ్య ఫిర్యాదు మేరకు జగిత్యాల టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సీఐ కరుణాకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టగా, మంగళవారం మధ్యాహ్నం 12.45 గంటలకు లింగంపేట రైల్వే స్టేషన్ సమీపంలో నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పంచుల సమక్షంలో విచారణ జరపగా నిందితులు నేరాన్ని ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. అనంతర వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డిఎస్పీ రఘుచందర్ వెల్లడించారు. సమావేశంలో ఎస్ఐ సుప్రియ, కానిస్టేబుల్ జీవన్ సిబ్బంది పాల్గొన్నారు.

# మండలిలో ఏఐ అటెండెన్స్ ఏది?

**బొత్స సత్యనారాయణ నిలదీత**

అమరావతి,ఫిబ్రవరి 17 (ఈవార్తలు): శాసనసభలో డిజిటల్ అటెండెన్స్ వ్యవస్థను అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే, ఈ వ్యవస్థను శాసనమండలిలో ఎందుకు అమలు చేయడం లేదని వైసీపీ సభ్యుడు బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. మండలి మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ... ఈ అంశంపై ప్రభుత్వం స్పష్టతను ఇవ్వాలని డిమాండ్ చేశారు. తిరుమల లడ్డూ ప్రసాదంలో పందికొవ్వు, జంతువుల కొవ్వు కలిపారని ప్రచారం చేయడం బాధాకరమని అన్నారు. వాస్తవాలు తేలాలని సుప్రీంకోర్టు సిట్ నియమించిందని చెప్పారు. దర్యాప్తులో కొన్ని ఆశ్చర్యకర విషయాలు, ప్రజలు జీర్ణించుకోలేని నిజాలు వెలుగులోకి వస్తున్నాయని అన్నారు. టాయిలెట్లలో వాడే కెమికల్స్ లడ్డూలో కలిపారని సీఎం మాట్లాడటం దురదృష్టకరమని, చంద్రబాబు అధికార దాహంతో ఏ స్థాయికైనా వెళతారని బొత్స విమర్శించారు.

# నందిని డైరీని తప్పించలేదు

**శ్రీవారి నెయ్యి టెండర్లపై టీటీడీ క్లారిటీ**

తిరుమల, ఫిబ్రవరి 17 (ఈవార్తలు): తిరుమల శ్రీవారి ప్రసాదాల తయారీకి వినియోగించే నెయ్యి కొనుగోలు టెండర్ల ప్రక్రియపై ఇటీవల వస్తున్న ఆరోపణలపై తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) స్పందించింది. టెండర్ల కేటాయింపు అత్యంత పారదర్శకంగా జరిగిందని, ఇందులో ఎలాంటి అవకతవకలకు తావులేదని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. కొన్ని సంస్థలకు అనుకూలంగా వ్యవహరించారని, ధరలు పెంచి కట్టబెట్టారని వస్తున్న ఆరోపణలను ఆయన ఆధారాలతో సహా ఖండించారు. ప్రముఖ కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ (కేఎంఎఫ్) బ్రాండ్ అయిన 'నందిని' డైరీని తప్పించారనే ప్రచారంలో వాస్తవం లేదని టీటీడీ చైర్మన్ తెలిపారు. 2024 నుంచి ఇప్పటివరకు నిర్వహించిన మొత్తం 7 టెండర్లలో 4 టెండర్లను నందిని డైరీనే దక్కించుకుందని వివరించారు. దీని ద్వారా మొత్తం 40 లక్షల కిలోల నెయ్యి సరఫరాకు నందిని అర్హత సాధించిందని, ప్రస్తుతం టీటీడీకి అవసరమైన నెయ్యిలో 62 శాతం వాటాను ఆ సంస్థే అందిస్తోందని పేర్కొన్నారు. ఆసక్తికరంగా, 2019-24 మధ్య కాలంలో నందిని డైరీకి టీటీడీ నుంచి ఎటువంటి టెండర్లు లభించలేదనే విషయాన్ని కూడా ఆయన గుర్తుచేశారు. టెండర్లలో ధరలు పెంచి ఆర్డర్లు ఇచ్చారని, కమీషన్ల కోసమే ఇలా చేశారని వస్తున్న విమర్శలపైనా టీటీడీ వివరణ ఇచ్చింది. 2016లో లీటరు ఆవు పాల ధర రూ.17-20 ఉండగా, కిలో నెయ్యి ధర రూ.278గా ఉండేదని తెలిపారు. ప్రస్తుతం పాల సేకరణ ధర రూ.42కు (సుమారు 147 శాతం పెరుగుదల) చేరినందున, నెయ్యి మార్కెట్ ధర కూడా దానికి అనుగుణంగా రూ.658కి (సుమారు 137 శాతం పెరుగుదల) పెరిగిందన్నారు. జాతీయ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్ డీడీబీ) నిపుణుల సూచనలు, దేశవ్యాప్త హోల్‌సేల్ మార్కెట్ ధరలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే అత్యంత పారదర్శకంగా ధరలను ఖరారు చేశామని స్పష్టం చేశారు. కేవలం ఇందాపూర్ డైరీకే టెండర్లు కట్టబెట్టారన్న ఆరోపణను కూడా టీటీడీ తోసిపుచ్చింది. మొత్తం 7 టెండర్లలో ఇందాపూర్ డైరీ కేవలం 2 టెండర్లను మాత్రమే దక్కించుకుని 10 లక్షల కిలోల నెయ్యిని సరఫరా చేస్తోందని తెలిపారు. టెండర్లలో పాల్గొన్న వాటిలో నాణ్యతా ప్రమాణాల ప్రకారం అర్హత సాధించిన నందిని, మదర్ డైరీ, సంగం, ఇందాపూర్ డైరీలకు ఆర్డర్లు కేటాయించినట్లు వెల్లడించారు. ఒక టెండర్‌లో గెలుపొందిన నందిని డైరీ, పెరిగిన ధరల కారణంగా తాము 20 లక్షల కిలోలకు బదులు 10 లక్షల కిలోల నెయ్యిని మాత్రమే సరఫరా చేయగలమని వెల్లడించిందని టీటీడీ పేర్కొంది. శ్రీవారి ప్రసాదాల తయారీకి నెయ్యి సరఫరాలో అంతరాయం కలగకుండా ఉండేందుకే, నిబంధనల ప్రకారం ఎల్2గా నిలిచిన ఇతర జాతీయ స్థాయి డైరీలకు అవకాశం కల్పించాల్సి వచ్చిందని వివరించారు. టెండర్ దక్కించుకున్న అన్ని కంపెనీలు ఎఫ్ఎస్ఎస్ఏఐ, ఎన్ డీడీబీ నిబంధనలను కచ్చితంగా పాటిస్తున్నాయని, శ్రీవారి ప్రసాదాల నాణ్యత, పవిత్రతను కాపాడటానికి టీటీడీ బోర్డు కట్టుబడి ఉందని చైర్మన్ బీఆర్ నాయుడు పునరుద్ఘాటించారు.

# చిన్నారి హత్యాచారం

## మదనపల్లెలో విషాదం



మదనపల్లె (అన్నమయ్య జిల్లా), ఫిబ్రవరి 17 (ఈవార్తలు): ఏపీలోని అన్నమయ్య జిల్లా మదనపల్లెలో విషాదం చోటుచేసుకుంది. అదృశ్యమైన ఏడేళ్ల చిన్నారి ఎదురింటిలో శవమై లభించింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు...పట్టణంలోని నీరుగట్టువారిపల్లెకు చెందిన దంపతులకు ఏడేళ్ల చిన్నారి ఉన్నారు. అదే గ్రామానికి చెందిన ఎదురింటి యువకుడు కులవర్ధన్ (30) చెడు వ్యసనాలకు బానిసై జులాయిగా తిరుగుతున్నాడు. సోమవారం సాయంత్రం గంజాయి మత్తులో ఉన్న నిందితుడు చిన్నారిని తన ఇంటికి తీసుకువెళ్లాడు. అత్యాచారం చేసి, ఆపై హత్య చేసి డ్రమ్ములో కుక్కిపెట్టాడు. పాప కనబడకపోవడంతో తల్లిదండ్రులు చుట్టు పక్కల గాలించారు. ఫలితం లేకపోవడంతో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కులవర్ధన్ పాపతో మాట్లాడుతుండటం తాను గమనించానని పాప తాత నరసింహులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లాడు. మంగళవారం నిందితుడి ఇంటికి పోలీసులు వెళ్లి తనిఖీ చేశారు. డ్రమ్ములో శవమై ఉన్న చిన్నారి భౌతికకాయాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కులవర్ధన్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించేందుకు పోలీసులు ప్రయత్నించగా స్థానికులు తిరుగుబాటు చేశారు. ఐసిడిఎస్ పీడీ హేమావతి సంఘటనా స్థలానికి వచ్చి స్థానికులతో చర్చలు జరిపినా మృతదేహాన్ని తరలించేందుకు ఒప్పుకోలేదు. మదనపల్లె సబ్ కలెక్టర్ కల్యాణి, కడప జిల్లా ఎస్పి నచికేత్ విశ్వనాథ్ సంఘటనా స్థలానికి వెళ్లి చిన్నారి తల్లిదండ్రులతో మాట్లాడి.... న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. బాధితులతో హోం మంత్రి అనిత, విద్యా శాఖ మంత్రి లోకేష్ ఫోన్‌లో మాట్లాడారు. అనంతరం చిన్నారి మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. నిందితుడిని ఉరితీయాలని జాతీయ రహదారిపై స్థానికులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని సిపిఎం అన్నమయ్య జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు.

**నిందితులను వదిలిపెట్టం: చంద్రబాబు**

అన్నమయ్య జిల్లా మదనపల్లెలో ఏడేళ్ల బాలిక దారుణ హత్యకు గురైన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. ఆయన బాలిక తల్లిదండ్రులకు ఫోన్ చేసి పరామర్శించారు. ఈ ఘాతుకానికి పాల్పడిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టేది లేదని, నిందితుడికి కఠిన శిక్ష పడేలా చూస్తామని వారికి హామీ ఇచ్చారు. ఈ దారుణ ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. అటు.. హోం మంత్రి వంగలపూడి అనిత కూడా బాలిక కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు. నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, బెయిల్ రాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.





# బంగ్లా పీఎంగా

**11వ ప్రధానిగా బాధ్యతలు**
**35 ఏళ్ల తర్వాత పురుష ప్రధాని**

# తారిక్ ప్రమాణం

బంగ్లాదేశ్‌లో కొత్త రాజకీయ అధ్యాయం మొదలైంది. దేశ 11వ ప్రధానమంత్రిగా బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) ఛైర్మన్ తారిక్ రెహ్మాన్ మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఇటీవల జరిగిన 13వ పార్లమెంటరీ ఎన్నికల్లో బీఎన్‌పీ ఘన విజయం సాధించడంతో ఆయన ప్రధాని పీఠాన్ని అధిష్టించారు. దాదాపు 35 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత బంగ్లాదేశ్‌కు ఒక పురుషుడు ప్రధాని కావడం విశేషం. ఢాకాలోని జాతీయ పార్లమెంట్ సౌత్ ప్లాజాలో జరిగిన కార్యక్రమంలో బంగ్లాదేశ్ అధ్యక్షుడు మహమ్మద్ షహబుద్దీన్, తారిక్ రెహ్మాన్‌తో ప్రమాణం చేయించారు.

**ఆయనతో పాటు 50 మంది సభ్యుల మంత్రివర్గం కూడా ప్రమాణం చేసింది. ఈ కేబినెట్‌లో 25 మంది మంత్రులు, 24 మంది సహాయ మంత్రులు, ముగ్గురు టెక్నోక్రాట్‌లు ఉన్నారు. తొలిసారి ఎన్నికైన వారితో పాటు పలువురు కొత్త ముఖాలకు మంత్రివర్గంలో చోటు కల్పించారు. అంతకుముందు, పార్లమెంట్ సభ్యులుగా బీఎన్‌పీకి చెందిన 209 మంది ఎంపీలు ప్రమాణం చేశారు. అయితే, రాజ్యాంగ సంస్కరణల మండలి ప్రమాణ పత్రంపై సంతకాలు చేయడానికి పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు వారు నిరాకరించారు. తాము కౌన్సిల్ సభ్యులుగా ఎన్నిక కాలేదని, అందుకే ఆ ప్రమాణాన్ని స్వీకరించబోమని బీఎన్‌పీ నేత సలావుద్దీన్ అహ్మద్ స్పష్టం చేశారు.**



ఢాకా: బీఎన్‌పీ వైఖరిని నిరసిస్తూ జమాత్-ఎ-ఇస్లామీ, ఇస్లామీ ఆందోళన్, నేషనల్ సిటిజన్స్ పార్టీ (ఎన్‌సీపీ)లతో కూడిన 11 పార్టీల కూటమి తొలుత ప్రమాణ స్వీకారాన్ని బహిష్కరించాలని నిర్ణయించింది. అయితే, కొద్దిసేపటికే ఈ రాజకీయ డ్రామాకు తెరపడింది. జమాత్ నేతృత్వంలోని కూటమి, స్వతంత్రులు, ఇస్లామీ ఆందోళన్ బంగ్లాదేశ్, ఎన్‌సీపీ ఎంపీలు వేర్వేరుగా ప్రమాణం చేశారు. దేశ చరిత్రలో తొలిసారిగా ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) ఏఎంఎం నసీర్ ఉద్దీన్ కొత్తగా ఎన్నికైన ఎంపీలతో ప్రమాణం చేయించడం గమనార్హం. ఫిబ్రవరి 12న 299 పార్లమెంట్ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో బీఎన్‌పీ 209 సీట్లు గెలుచుకోగా, రాడికల్ ఇస్లామిస్ట్ పార్టీ అయిన జమాత్-ఎ-ఇస్లామీ 68 స్థానాల్లో విజయం సాధించింది. రెండు చోట్ల గెలిచిన తారిక్ రెహ్మాన్, బోగ్రా-6 స్థానాన్ని వదులుకుని, ఢాకా-17 ఎంపీగా ప్రమాణం చేశారు. గత 18 నెలలుగా మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని మధ్యంతర ప్రభుత్వ హయాంలో పెరిగిన అశాంతి, ఇస్లామిక్ తీవ్రవాదాన్ని అరికట్టడం కొత్త ప్రభుత్వానికి అతిపెద్ద సవాలుగా నిలవనుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## తారిక్‌తో ఓం బిర్లా భేటీ

బంగ్లాదేశ్ నూతన ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తారిక్ రెహమాన్‌తో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా మంగళవారం భేటీ అయ్యారు. ఢాకాలో జరిగిన ఈ సమావేశంలో, ప్రధానిగా బాధ్యతలు చేపట్టినందుకు తారిక్ రెహమాన్‌కు ఓం బిర్లా శుభాకాంక్షలు తెలిపారు. ఇదే సమయంలో ఆయన్ను భారత్‌లో పర్యటించాలని సాదరంగా ఆహ్వానించారు. ఇరు దేశాల ప్రజల శ్రేయస్సు కోసం కలిసికట్టుగా పనిచేయడానికి ఇద్దరు నేతలు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఓం బిర్లా తన ఎక్స్ ఖాతాలో స్పందిస్తూ.. "ప్రజాస్వామ్య, ప్రగతిశీల, సమ్మిళిత దేశ నిర్మాణంలో బంగ్లాదేశ్ చేస్తున్న ప్రయత్నాలకు భారత్ మద్దతుగా నిలుస్తుంది" అని పేర్కొన్నారు. తారిక్ రెహమాన్ ఏర్పాటు చేసిన క్యాబినెట్‌లో 25 మంది మంత్రులు, 24 మంది సహాయ మంత్రులు, ముగ్గురు టెక్నోక్రాట్‌లు ఉన్నారు. ఈ పరిణామంపై భారత విదేశాంగ శాఖ కూడా ఒక ప్రకటన విడుదల చేసింది. "ఈ కీలక కార్యక్రమంలో స్పీకర్ పాల్గొనడం ఇరు దేశాల మధ్య ఉన్న లోతైన, చిరకాల స్నేహబంధాన్ని చాటుతోంది. ప్రజాస్వామ్య విలువలకు భారత్ కట్టుబడి ఉంటుందని పునరుద్ఘాటిస్తున్నాం" అని తెలిపింది. తారిక్ రెహమాన్ నాయకత్వానికి ప్రజలు బలమైన తీర్పు ఇచ్చారని, ఆయన నేతృత్వంలో ఏర్పడిన ప్రభుత్వాన్ని స్వాగతిస్తున్నామని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది.



## బంగ్లాదేశ్‌లో మంత్రిగా హిందూ నేత

తారిక్ ప్రభుత్వ కేబినెట్‌లో హిందూ మైనారిటీ వర్గానికి చెందిన సీనియర్ నాయకుడు నితాయ్ రాయ్ చౌదరికి చోటు దక్కడం విశేషం. ప్రధానమంత్రి తారిఖ్ రెహమాన్ నియమించిన 25 మంది క్యాబినెట్ మంత్రులలో నితాయ్ రాయ్ చౌదరి ఒకరు. ఆయనకు సాంస్కృతిక వ్యవహారాల మంత్రిత్వ శాఖ బాధ్యతలు కేటాయించనున్నట్లు పలు రిపోర్టులు పేర్కొంటున్నాయి. నితాయ్ రాయ్ ఫిబ్రవరి 12న జరిగిన జాతీయ పార్లమెంట్ ఎన్నికల్లో ఆయన మగురా-2 నియోజకవర్గం నుంచి ఘనవిజయం సాధించారు. తన ప్రత్యర్థి అయిన జమాత్-ఏ-ఇస్లామీ అభ్యర్థిని భారీ మెజారిటీతో ఓడించారు. 77 ఏళ్ల నితాయ్ రాయ్ చౌదరి 1949లో బంగ్లాదేశ్‌లోని మగురా జిల్లాలో జన్మించారు. ఆయన వృత్తిరీత్యా న్యాయవాది. తన ప్రాథమిక విద్యను మగురా గవర్నమెంట్ కాలేజీలో పూర్తి చేశారు. అనంతరం ఢాకా విశ్వవిద్యాలయం నుండి లా (న్యాయశాస్త్రం) పట్టా పొందారు. ఢాకా యూనివర్సిటీలో విద్యార్థిగా ఉన్నప్పుడే ఆయన రాజకీయాల్లో చురుగ్గా ఉండేవారు. అక్కడే ఆయన రాజకీయ జీవితానికి పునాది పడింది. 1988లో మగురా-2 నియోజకవర్గం నుండి తొలిసారిగా జాతీయ పార్లమెంట్‌కు నితాయ్ రాయ్ ఎన్నికయ్యారు. ఆయన ప్రస్తుతం బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ వైస్ ఛైర్మన్‌గా కొనసాగుతున్నారు. గతంలో ఆయన విద్య, యువజన, క్రీడల శాఖల మంత్రిగా కూడా పనిచేశారు. నితాయ్ రాయ్ కుమార్తె నిపుణ్ రాయ్ చౌదరి కూడా బీఎన్‌పీలో అత్యంత క్రియాశీలక నాయకురాలిగా కొనసాగుతున్నారు. ప్రస్తుతం పార్టీ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యురాలిగా ఉన్నారు.



## ఎవరెస్ట్ ఎత్తుకు వెళ్లే హెలికాప్టర్ తయారుచేస్తాం

**ముంబైలో ద్వైపాక్షిక అంశాలపై మోదీ, మేక్రాన్ చర్చలు**

ముంబై: ఫ్రాన్స్ సహకారంతో ఎవరెస్ట్ అంత ఎత్తుకు వెళ్లగలిగే హెలికాప్టర్‌ను తయారుచేస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ముంబైలోని లోక్ భవన్‌లో సమావేశమైన ప్రధాని మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ద్వైపాక్షిక అంశాలపై చర్చించారు. అంతకుముందు, కర్ణాటకలోని వేమగల్‌లో ఎయిర్ బస్ హెచ్-125 హెలికాప్టర్ల తయారీ అసెంబ్లీ లైన్‌ను మోదీ, మేక్రాన్ కలిసి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ, భారత్, ఫ్రాన్స్ సంబంధాలు ప్రత్యేకమైనవని అన్నారు. ఆ దేశం దశాబ్దాలుగా భారతదేశానికి వ్యూహాత్మక భాగస్వామిగా ఉందని అన్నారు. కాగా, మేక్రాన్ తన పర్యటనలో భాగంగా ఢిల్లీలో జరగనున్న 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్'లో పాల్గొననున్నారు. మేక్రాన్ నేటి నుంచి మూడు రోజుల పాటు భారత్‌లో పర్యటించనున్నారు.

## రాజస్థాన్‌లో ఏడుగురి సజీవ దహనం

జైపూర్: రాజస్థాన్ భివాడిలోని ఓ కెమికల్ ఫ్యాక్టరీలో నిన్న భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఏడుగురు కార్మికులు సజీవ దహనమయ్యారు. మరో ఇద్దరు ఫ్యాక్టరీలోనే చిక్కుకుని తీవ్రంగా గాయపడ్డారు. అకస్మాత్తుగా ఫ్యాక్టరీలో మంటలు చెలరేగగా.. కొద్ది సేపటికే భారీ పేలుళ్లు సంభవించాయి. దీంతో స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపుచేసి సహాయక చర్యలు చేపట్టారు. భద్రతా కారణాల దృష్ట్యా ఫ్యాక్టరీ పరిసర ప్రాంతాల్లోని ప్రజలను ముందస్తుగా ఖాళీ చేయించారు. కాగా ప్రమాదంలో చిక్కుకున్న ఇద్దరు కార్మికులను రక్షించి ఆసుపత్రికి తరలించారు. ఇక ఈ ఫ్యాక్టరీ వస్త్రాల కర్మాగారంగా చలామణి అవుతూ అక్రమంగా బాణాసంచా తయారు చేస్తున్నట్లు జిల్లా అదనపు మెజిస్ట్రేట్ సుమిత్రా పారీక్ వెల్లడించారు. ఈ ఘటనలో ఏడుగురు మృతి చెందడంపై ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలియజేశారు.

## శ్రీలంకలో ఎంపీల పెన్షన్లు రద్దు

కొలంబో: పొరుగు దేశం శ్రీలంక ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎంపీల పెన్షన్లను పూర్తిగా రద్దు చేసింది. దీనికి సంబంధించిన బిల్లు పార్లమెంట్‌లో మంగళవారం ఆమోదం పొందింది. 225 మంది సభ్యులు కలిగిన సభలో 154 మంది ఈ బిల్లుకు అనుకూలంగా ఓటేశారు. కేవలం ఇద్దరు మాత్రమే వ్యతిరేకించారు. మిగిలిన సభ్యులు ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. శ్రీలంకలో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసిన పార్లమెంట్ సభ్యులకు ప్రస్తుతం పెన్షన్ అందుతోంది. కొత్త చట్టం ఆమోదం పొందడంతో ఇప్పటికే అందుకుంటున్న వారితో పాటు, కొత్తగా అర్హత సాధించిన వారికీ పెన్షన్లు నిలిచిపోనున్నాయి. ఇప్పటికే మాజీ అధ్యక్షులకు ఇచ్చే ప్రయోజనాలను దిసనాయకే ప్రభుత్వం నిలిపివేసింది. ఇంటి అద్దె, అలవెన్సులు, పెన్షన్లు, రవాణా సౌకర్యాలను గతేడాది సెప్టెంబర్‌లో రద్దు చేసింది. పర్యాటకంపై ఆధారపడిన దేశమైన శ్రీలంకకు కరోనా, ఉగ్రవాద దాడుల కారణంగా విదేశీయుల రాక తగ్గింది. నాటి పాలకుల ఆర్థిక నిర్వహణ లోపం కారణంగా పరిస్థితి మరింత తీవ్రమైంది. 2022లో దివాళా తీసింది. దీంతో నాటి పాలకులపై ప్రజల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. దేశంలో ఆహారం, ఔషధాలు, విద్యుత్, చమురుకు తీవ్ర సంక్షోభం ఏర్పడింది. ప్రజల నుంచి ఆందోళనలు చెలరేగడంతో నాటి అధ్యక్షుడు గొటబాయ రాజపక్స తన పదవికి రాజీనామా చేశారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో మార్క్సిస్టు నేత దిసనాయకే విజయం సాధించి అధ్యక్ష పగ్గాలు చేపట్టారు. ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టడంలో భాగంగా ఎన్నికల వాగ్దానంలో ఒకటైన పెన్షన్ల రద్దుకు బిల్లు తీసుకొచ్చారు. దేశం క్లిష్టపరిస్థితులు ఎదుర్కొంటున్న వేళ చట్టసభ సభ్యులకు పెన్షన్లు పొందే నైతికత లేదంటూ ఈ బిల్లుపై చర్చ సందర్భంగా న్యాయ శాఖ మంత్రి హర్షణ నానాయక్కర పేర్కొన్నారు.

## పాక్‌లో ఆత్మాహుతి దాడి.. 11 మంది సైనికుల మృతి

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లో మరోసారి ఉగ్రవాదులు రెచ్చిపోయారు. ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లోని బాజౌర్ జిల్లాలో భద్రతా సిబ్బంది లక్ష్యంగా జరిగిన ఆత్మాహుతి కారు బాంబు దాడిలో 11 మంది సైనికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనను పాక్ సైనిక మీడియా విభాగం ఐఎస్‌పీఆర్ మంగళవారం ధృవీకరించింది. ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దుకు సమీపంలోని బాజౌర్‌లో ఫిబ్రవరి 16న ఈ దాడి జరిగింది. పేలుడు పదార్థాలు నింపిన వాహనంతో వచ్చిన ఆత్మాహుతి దళ సభ్యుడు, ఒకప్పటి మత పాఠశాల భవనంలో ఏర్పాటు చేసిన ఫ్రాంటియర్ కార్ప్స్ చెక్‌పోస్ట్‌ను ఢీకొట్టాడు. ఈ దాడిలో చెక్‌పోస్ట్ భవనం పూర్తిగా కుప్పకూలిపోయింది. శిథిలాల కింద నుంచి మృతదేహాలను వెలికితీశారు. ఈ శక్తివంతమైన పేలుడు ధాటికి సమీపంలోని ఒక ఇంట్లో నివసిస్తున్న చిన్నారి కూడా మరణించగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. గత కొన్ని నెలలుగా పాకిస్థాన్‌లో ఉగ్రదాడులు, ఆత్మాహుతి దాడులు గణనీయంగా పెరిగాయి. సోమవారం కూడా బన్నూ జిల్లాలోని ఓ పోలీస్ స్టేషన్ సమీపంలో మోటార్‌సైకిల్‌కు అమర్చిన బాంబు పేలి ఇద్దరు పౌరులు (ఒక చిన్నారితో సహా) మరణించగా, 14 మంది గాయపడ్డారు. 2025లో పాకిస్థాన్‌లో భద్రతా పరిస్థితులు తీవ్రంగా క్షీణించాయని తాజా నివేదికలు చెబుతున్నాయి. 2024తో పోలిస్తే గత ఏడాది దాడులు 34% పెరిగి 699కి చేరాయి. ఈ దాడుల్లో మొత్తం 1,034 మంది మరణించగా, 1,366 మంది గాయపడ్డారు. దేశంలో ఉగ్రవాద హింస వరుసగా ఐదో ఏడాది కూడా పెరగడం ఆందోళన కలిగిస్తోంది.

## 38 వేలు దాటిన డ్రోన్ల రిజిస్ట్రేషన్లు

**39,890కి చేరిన డీజీసీఏ సర్టిఫైడ్ రిమోట్ పైలట్లు**

న్యూఢిల్లీ: భారతదేశంలో డ్రోన్ రంగం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోంది. దేశవ్యాప్తంగా రిజిస్టర్ అయిన డ్రోన్ల సంఖ్య 38,500 మార్కును దాటింది. అదే సమయంలో, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) నుంచి ధృవీకరణ పొందిన రిమోట్ పైలట్ల సంఖ్య 39,890కి చేరినట్లు మంగళవారం విడుదలైన అధికారిక గణాంకాలు స్పష్టం చేశాయి. దేశంలో డ్రోన్ల వినియోగం పెరగడానికి తయారీదారులు, సాఫ్ట్‌వేర్ డెవలపర్లు, సర్వీస్ ప్రొవైడర్లు, శిక్షణా సంస్థలతో కూడిన ఒక సమగ్ర వ్యవస్థ అభివృద్ధి చెందడమే కారణమని ప్రభుత్వ ప్రకటన పేర్కొంది. డ్రోన్ల ఆపరేటింగ్, నిర్వహణ కోసం నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించేందుకు 240కి పైగా శిక్షణా సంస్థలు కూడా ఏర్పాటయ్యాయి. ప్రభుత్వ ప్రగతిశీల విధానాలు, ఆర్థిక ప్రోత్సాహకాలతో ఈ రంగం కేవలం పైలట్ ప్రాజెక్టుల నుంచి ప్రధాన స్రవంతిలోకి మారింది. సదుపాయాల పర్యవేక్షణ, విపత్తుల అంచనా, ప్రభుత్వ సేవల వంటి కీలక రంగాల్లో ఇప్పుడు డ్రోన్లు అంతర్భాగంగా మారాయి.




## మార్కెట్లకు బ్యాంకింగ్, ఐటీ షేర్ల కళ

ముంబై భారత స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో సెషన్‌లోనూ లాభాలతో ముగిశాయి. ప్రపంచ మార్కెట్ల నుంచి బలమైన సంకేతాలు లేనప్పటికీ, ప్రభుత్వ రంగ బ్యాంకులు (పీఎస్‌యూ), ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) షేర్లలో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు లాభపడ్డాయి. మంగళవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి, 30 షేర్ల సెన్సెక్స్ 173.81 పాయింట్లు పెరిగి 83,450.96 వద్ద స్థిరపడింది. ఇక బ్రాడర్ నిఫ్టీ 42.65 పాయింట్లు లాభపడి 25,725.40 వద్ద ముగిసింది. సెషన్ మొత్తంలో నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ 2 శాతానికి పైగా పెరిగి టాప్ పెర్ఫార్మర్‌గా నిలిచింది. అదేవిధంగా, నిఫ్టీ ఐటీ ఇండెక్స్ కూడా లాభాల్లో ముగిసింది. అయితే, మెటల్ కౌంటర్లలో బలహీనత కారణంగా నిఫ్టీ మెటల్ ఇండెక్స్ దాదాపు 1 శాతం నష్టపోయింది. బ్రాడర్ మార్కెట్‌లో నిఫ్టీ మిడ్‌క్యాప్ 0.27 శాతం, స్మాల్‌క్యాప్ 0.56 శాతం చొప్పున లాభపడ్డాయి. సెన్సెక్స్ ప్యాక్‌లో ఐటీసీ, బీఈఎల్, ఇన్ఫోసిస్, ఎల్‌డటీ, ఏషియన్ పెయింట్స్, టైటాన్ వంటి షేర్లు 2.3 శాతం వరకు లాభపడి టాప్ గెయినర్స్‌గా నిలిచాయి. మరోవైపు, ఎటర్నల్, ట్రెంట్, టాటా స్టీల్, రిలయన్స్, ఎండఎం, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు 1.5 శాతం వరకు నష్టపోయాయి. విశ్లేషకుల ప్రకారం, నిఫ్టీ 25,760-25,800 స్థాయి వద్ద అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంటుండగా, 25,550-25,600 వద్ద మద్దతు లభిస్తోంది. మరోవైపు, డాలర్ ఇండెక్స్‌లో కదలికలు లేకపోవడంతో రూపాయి 90.68 వద్ద పరిమిత శ్రేణిలో కదలాడింది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తగ్గడంతో సురక్షిత పెట్టుబడిగా బంగారంపై డిమాండ్ తగ్గింది. ఫలితంగా, గోల్డ్ ధర రూ. 1,500 తగ్గి రూ. 1,53,500 దిగువన ట్రేడ్ అయింది.

# ఫేక్ కంటెంట్‌పై కొత్త రూల్స్

**ఎల్లుండి నుంచి అమల్లోకి నిబంధనలు**





న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం కీలకం నిర్ణయం తీసుకుంది. ఆన్‌లైన్ ఫేక్ కంటెంట్‌ను అరికట్టడానికి కొత్త నిబంధనలను ప్రకటించింది. ఇవి కేవలం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కంటెంట్‌కే పరిమితం కాకుండా, అన్ని రకాల కంటెంట్‌పై వర్తించనున్నట్లు తెలిపింది. ఈ కొత్త నిబంధనలు ఫిబ్రవరి 20 నుంచి అమల్లోకి రానున్నాయి. ఇంటర్నెట్ యుగంలో వ్యక్తుల గోప్యత ఉల్లంఘన, నకిలీ సమాచారం, డీప్‌ఫేక్ వీడియోలు వంటి సమస్యలు పెరుగుతున్నాయి. అదే సమయంలో భావ ప్రకటనా స్వేచ్ఛను కాపాడాల్సిన అవసరం కూడా ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కొత్త నిబంధనల్ని అందుబాటులోకి తెచ్చింది. తద్వారా వినియోగదారులు ఎవరైనా సంబంధిత సోషల్ మీడియా ఫ్లాట్‌ఫామ్‌లో చూసిన ఫేక్ కంటెంట్ గురించి సంబంధిత ఫ్లాట్‌ఫామ్ యాజమాన్యానికి నేరుగా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసే వెసులు బాటు కల్పించింది. ఉదాహరణకు, ఫేస్‌బుక్‌లో గోప్యత ఉల్లంఘించే వీడియో కనిపిస్తే, ఫేస్‌బుక్ గ్రివెన్స్ ఆఫీసర్‌కి ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయాలి. ఫిర్యాదు చేసిన 24 గంటల్లోగా దాన్ని ఫ్లాట్‌ఫామ్ నుంచి తొలగిస్తుంది. అంతేకాదు, అశ్లీల కంటెంట్, పిల్లల లైంగిక నేరాలు, కులం లేదా మతం ఆధారిత ద్వేషం, నకిలీ సమాచారం వంటి వాటిని 36 గంటల్లో, వ్యక్తిగత నగ్నత్వం, లైంగిక సంపర్కం, డీప్‌ఫేక్ వీడియోలు వంటి వాటిపై ఫిర్యాదు వస్తే 2 గంటల్లో చర్య తీసుకోవాలి. కాపీరైట్, పేటెంట్, ట్రేడ్‌మార్క్ ఉల్లంఘనలపై ఫిర్యాదులు అయితే 7 రోజుల్లో పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వం లేదా కోర్టు ఆదేశాలపై కంటెంట్ తొలగించడానికి గడువు 36 గంటల నుండి 3 గంటలకు తగ్గించారు. జాతీయ భద్రత, శాంతిభద్రతలు, పరువు నష్టం వంటి అంశాలకు ఇది వర్తిస్తుంది. ఏఐ కంటెంట్‌పై ప్రత్యేక నియంత్రణలు కూడా ఉన్నాయి. ఏఐ ద్వారా రూపొందించిన కంటెంట్‌కి తప్పనిసరిగా లేబుల్ (నోటీసు) ఇవ్వాలి. ఆడియో లేదా వీడియోలో ప్రారంభంలోనే ఇది ఏఐ కంటెంట్ అని స్పష్టంగా చూపించాలి. అశ్లీల కంటెంట్, చైల్డ్ పోర్నోగ్రఫీ, నకిలీ పత్రాలు, డీప్‌ఫేక్‌లు ఉత్పత్తి కాకుండా ఆటోమేటెడ్ టూల్స్ ఏర్పాటు చేయాలి. సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు కంటెంట్ అప్‌లోడ్ చేసే సమయంలో వినియోగదారుల నుండి అఫిడవిట్ తీసుకోవాలి. ఇప్పటివరకు సోషల్ మీడియా సంస్థలకు సేఫ్ హార్బర్ ప్రొటెక్షన్ ఉండేది. కొత్త నిబంధనలతో, ప్లాట్‌ఫారమ్‌లు కంటెంట్ తొలగించడంలో విఫలమైతే ఈ రక్షణ కోల్పోతాయి. అంటే, వినియోగదారులు రాసిన పోస్ట్‌పై కూడా కంపెనీలు న్యాయపరమైన బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఈ కొత్త నిబంధనలు ఒకవైపు గోప్యత రక్షణను బలపరుస్తాయి, మరోవైపు భావ ప్రకటనా స్వేచ్ఛను కాపాడేలా రూపొందించబడ్డాయి. ఏఐ కంటెంట్‌కి ప్రత్యేక నియంత్రణలు ఉండటం వల్ల భవిష్యత్తులో డీప్‌ఫేక్‌లు, నకిలీ వీడియోలు వంటి సమస్యలు తగ్గే అవకాశం ఉంది.

## ఏప్రిల్‌లో బెంగాల్, తమిళనాడు ఎన్నికలు

న్యూఢిల్లీ: పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాల్లో ఏప్రిల్‌లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉన్నట్లు ఎన్నికల కమిషన్ వర్గాలు వెల్లడించాయి. ఈ రెండు రాష్ట్రాలతో పాటు అస్సాం, కేరళ, పుదుచ్చేరిలలో ఒకేసారి పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన ఎన్నికల షెడ్యూల్‌ను మార్చి మధ్యలో ఈసీ విడుదల చేసే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నాయి. ఈ క్రమంలో ఆయా రాష్ట్రాల్లో ఎన్నికల సన్నద్ధతను అంచనా వేయడానికి ఈసీ అధికారులు ఇప్పటికే పర్యటన ప్రారంభించారు. ప్రస్తుతం అస్సాంలో ఉన్నారు. పుదుచ్చేరి అసెంబ్లీ పదవీకాలం జూన్ 15న ముగుస్తుండగా.. అస్సాం, కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌ల పదవీకాలాలు మేలో ముగుస్తున్నాయి. ఆయా రాష్ట్రాల్లో ఈసీ నిర్వహిస్తోన్న 'సర్' ప్రక్రియ ముగింపు దశకు చేరుకుంది. పుదుచ్చేరి ఓటర్ల తుది జాబితాను ఫిబ్రవరి 14న ప్రచురించింది. తమిళనాడు తుది జాబితాను నేడు విడుదల చేయనుంది. అస్సాంలో ఫిబ్రవరి 10న, కేరళలో ఫిబ్రవరి 21న, పశ్చిమ బెంగాల్లో ఫిబ్రవరి 28న తుది జాబితాలు విడుదలకానున్నాయి.

## బ్యాంకుల్లో మిస్ సెల్లింగ్‌కు గుడ్ బై!

**కీలక సంస్కరణ దిశగా ఆర్బీఐ**




న్యూఢిల్లీ: బ్యాంకుల్లో బీమా సహా ఇతర ఆర్థిక ఉత్పత్తులను తప్పుదోవ పట్టించి విక్రయించడాన్ని (మిస్ సెల్లింగ్) నిరుత్సాహపరిచే నిబంధనలను ఆర్‌బీఐ ప్రతిపాదించింది. "ఉత్పత్తులు/సేవల విక్రయాలను పెంచుకునేందుకు గాను, మిస్ సెల్లింగ్ లేదా ఉద్యోగులను ప్రోత్సహించే విధంగా బ్యాంక్ విధానాలు, పద్ధతులు లేకుండా చర్యలు తీసుకోవాలి"అని ఆర్‌బీఐ తన ముసాయిదా నిబంధనల్లో పేర్కొంది. ఉత్పత్తులు/సేవల విక్రయాలకు సంబంధించి వివిధ యూనిట్ల మధ్య పోటీలను నిర్వహించడాన్ని ఉదాహరణగా ఆర్‌బీఐ పేర్కొంది. థర్డ్ పార్టీ (బ్యాంకు సొంతం కానివి) ఉత్పత్తులు/సేవల మార్కెటింగ్/విక్రయాలపై ఉద్యోగులకు ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ ఎలాంటి ప్రోత్సాహకాలు ఉండరాదని స్పష్టం చేసింది. అలాగే, బ్యాంక్‌లు తన ఉత్పత్తికి జోడింపుగా (బండిల్డ్) థర్డ్ పార్టీ ఉత్పత్తి విక్రయాన్ని చేపట్టరాదని కోరింది. ఈ విషయంలో కస్టమర్లకు ఒకటికి మించి ఆప్షన్లు అందించాలని నిర్దేశించింది. ఒకవేళ కస్టమర్‌ను తప్పుదోవ పట్టించి ఉత్పత్తిని విక్రయించినట్టు తేలితే.. అంత మొత్తాన్ని తిరిగి వెనక్కి ఇచ్చేయాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. దీనికి అదనంగా కస్టమర్‌కు ఏదైనా నష్టం కలిగితే అంత మేర పరిహారం చెల్లించాల్సి ఉంటుందని పేర్కొంది.

వయ్యారి చిత్రం






# చైతూ-తరుణ్ భాస్కర్ కాంబో!

కేవలం రెండు సినిమాలతోనే తనకంటూ ఒక ప్రత్యేకమైన బ్రాండ్ క్రియేట్ చేసుకున్నాడు తరుణ్ భాస్కర్. ప్రస్తుతం ఈ యంగ్ డైరెక్టర్ అటు మెగాఫోన్ పట్టి సినిమాలను తెరకెక్కిస్తూనే, ఇటు నటుడిగా వరుస ప్రాజెక్టులతో బిజీగా గడుపుతున్నాడు. ఇప్పటికే 'ఈ నగరానికి ఏమైంది 2' షూటింగ్‌ను శరవేగంగా పూర్తి చేస్తున్న ఆయన, త్వరలోనే 'పెళ్లి చూపులు 2'ను కూడా సెట్స్ పైకి తీసుకెళ్లే ఆలోచనలో ఉన్నాడు. ఇందులో విజయ్ దేవరకొండ కనిపిస్తాడా లేక కొత్త హీరో వస్తాడా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. దర్శకుడిగా తరుణ్ భాస్కర్ తన నెక్స్ట్ ప్రాజెక్టును నాగచైతన్యతో ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. చైతూ కోసం ఒక ఇంట్రెస్టింగ్ కథను సిద్ధం చేయగా, అది ఆయనకు బాగా నచ్చిందని టాక్. ప్రస్తుతం చైతన్య 'వృషకర్మ' సినిమా పనుల్లో ఉండగా, అది పూర్తయిన వెంటనే తరుణ్ భాస్కర్ సినిమా పట్టాలెక్కే అవకాశం ఉంది. ఒకవేళ అంతా కుదిరితే, 'ఈ నగరానికి ఏమైంది 2' తర్వాత తరుణ్ డైరెక్ట్ చేసే క్రేజీ ప్రాజెక్ట్ ఇదే అవుతుంది. మరోవైపు, సీనియర్ హీరో వెంకటేష్ కోసం తరుణ్ సిద్ధం చేసిన కథ ఇంకా స్క్రిప్ట్ స్టేజ్‌లోనే ఉంది. సురేష్ బాబు సూచించిన మార్పుల వల్ల ఆ ప్రాజెక్ట్ కాస్త ఆలస్యమవుతోంది. ఈ గ్యాప్‌లో చైతన్య తన ఇతర కమిట్‌మెంట్స్‌తో బిజీగా ఉన్నాడు. నాగార్జున – కళ్యాణ్ కృష్ణ కాంబోలో రాబోయే సినిమాలో కూడా చైతూ భాగమయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో, తరుణ్ మరియు నాగచైతన్య కాంబినేషన్ ఎప్పుడు సెట్స్ పైకి వెళ్తుందోనని అక్కినేని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# త్వరలో డ్రాగన్ రిలీజ్ డేట్?




టాలీవుడ్ యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్, స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్ లో రూపొందుతున్న డ్రాగన్ మూవీ షూటింగ్ జరుగుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే రిలీజ్ కావాల్సిన ఆ సినిమా.. అలా లేట్ అవుతూ వచ్చింది. ఈ ఏడాది జూన్ లో విడుదల చేయాలని మేకర్స్ అనుకున్నారు. అందుకు తగ్గట్లే ప్లాన్ కూడా వేసి షూటింగ్ మొదలుపెట్టారు. కానీ ఇంకా చాలా వరకు షూటింగ్ పెండింగ్ ఉండడంతో.. ఆ సమయానికి రిలీజ్ చేయడం కష్టమని తెలుస్తోంది. దీంతో సినిమా వచ్చే ఏడాదికి వాయిదా పడే అవకాశం ఉందని ఇటీవల వార్తలు వినిపించాయి. అందులో నిజమెంతో తెలియకపోయినా.. ఊహాగానాలు చక్కర్లు కొడుతున్నాయి. అయితే ఆ వాటికి చెక్ పెట్టేలా.. ఫ్యాన్స్ కు సర్ప్రైజ్ ఇచ్చేలా మేకర్స్ షూటింగ్ ను స్పీడ్ గా నిర్వహిస్తున్నారని తెలుస్తోంది. ప్రస్తుతం ఫారిన్ లో సినిమాలోని కీలక సన్నివేశాలు షూట్ చేస్తున్నారు మేకర్స్. ముఖ్యంగా ఇప్పుడు జోర్డాన్ లో యాక్షన్ ఎపిసోడ్స్ ను తెరకెక్కిస్తున్నారు. ఎడారి ప్రాంతాల్లో తీస్తున్న ఆ సన్నివేశాలు సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయని సమాచారం. నేచురల్ ల్యాండ్ స్కేప్స్ సినిమాలో యాక్షన్ ఎపిసోడ్లకు కొత్త లుక్ తీసుకురానున్నాయని టాక్ వినిపిస్తోంది. అ

# భయపెడుతున్న కేరళ స్టోరీ2 ట్రైలర్

2023లో సంచలనం సృష్టించిన ది కేరళ స్టోరీ సినిమా సక్సెస్ తర్వాత విపుల్ అమృత్‌లాల్ షా ఇప్పుడు ఆ సీక్వెల్‌తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ఈ సినిమాకు ది కేరళ స్టోరీ2 అనే టైటిల్ ను ఫిక్స్ చేయగా, తాజాగా సినిమాకు సంబంధించిన ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేయగా, అది చర్చనీయాంశంగా మారింది. వచ్చే 25 ఏళ్లలో భారత్ సరియా చట్టాల ఆధారంగా నడిచే ఇస్లామిక్ ప్రాంతంగా మారే ప్రమాదం ఉందనే హెచ్చరికతో ట్రైలర్ ను మొదలుపెట్టగా, అనంతరం కథ రాజస్థాన్‌కు మలుపు తిరుగుతుంది. అక్కడ 16 ఏళ్ల బాలికను మతమార్పిడికి బలవంతం చేశారనే ఆరోపణలతో ఆమె కుటుంబం పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదు చేయడానికి వచ్చిన సీన్స్ ను చూపించారు. తర్వాత కథ మధ్యప్రదేశ్‌కు మారుతుంది. ఒక హిందూ యువతిని ప్రేమ పేరుతో మోసం చేసి వివాహం చేసుకున్న తర్వాత మత మార్పిడికి ఒత్తిడి తీసుకురావడాన్ని చూపించారు. మూడో కథ కేరళలో నడుస్తుంది. లివ్-ఇన్ రిలేషన్‌షిప్ పేరుతో ఒక యువతిని మతం మార్చుకునేలా ఒత్తిడి చేయడం, ఆమె నిరాకరించడంతో బలవంతంగా నిర్బంధించడం లాంటి సీన్స్ ను ట్రైలర్‌లో చూపించారు. మతమార్పిడి అనంతరం ఈ ముగ్గురు యువతులు ఎదుర్కొనే హింస, వారి కుటుంబాలు పడే వేదన కూడా ట్రైలర్‌లో స్పష్టంగా చూపించారు. మేకర్స్ ఈ ట్రైలర్ ను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ, ఈ సారి మౌనం కాదు, పోరాటం, మా కూతుళ్లను టార్గెట్ గా చేసుకున్నారు. వారి ఫ్యూచర్‌ను దోచుకున్నారు. ఇక మేం మౌనంగా ఉండేది లేదంటూ పేర్కొన్నారు. కాగా ది కేరళ స్టోరీ2 సినిమా ఫిబ్రవరి 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. కామాఖ్య నారాయణ సింగ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో ఉల్కా గుప్తా, అదితి భాటియా, ఐశ్వర్య ఓజా ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాను సన్‌షైన్ పిక్చర్స్ బ్యానర్ పై విపుల్ అమృత్‌లాల్ షా నిర్మించగా, ఆశిన్ ఎ. షా కో ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తున్నారు. ట్రైలర్ తోనే ది కేరళ స్టోరీ2పై ఆడియన్స్ లో మంచి ఆసక్తి నెలకొనగా, ఈ ట్రైలర్ కు నెటిజన్ల నుంచి రకరకాల అభిప్రాయాలు వెలువడుతున్నాయి.






# నిర్మాతగా నిత్యా

దక్షిణాది చిత్ర పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న జాతీయ అవార్డు గ్రహీత, నటి నిత్యా మీనన్ నిర్మాతగా కొత్త ప్రయాణాన్ని ప్రారంభించారు. 'కీయురి ప్రొడక్షన్స్' పేరుతో తన సొంత నిర్మాణ సంస్థను మంగళవారం ప్రకటించారు. ఈ విషయాన్ని తన ఇన్‌స్టాగ్రామ్ పేజీ ద్వారా వెల్లడిస్తూ, ప్రొడక్షన్ హౌస్ లోగో వీడియోను పంచుకున్నారు. సినిమాలు తీయడమంటే కేవలం కథలు చెప్పడం మాత్రమే కాదని, మనుషులను లోతైన స్థాయిలో స్పృశించడం అని ఆమె పేర్కొన్నారు. "నటన ప్రారంభించిన తొలిరోజు నుంచి నా ఉద్దేశం ఇదే. ఇప్పుడు నిర్మాతగా కూడా అదే ఉద్దేశంతో కొనసాగుతాను. నాలోని సృజనాత్మక ప్రక్రియ ద్వారా, చూసేవారిలో ఒక పరివర్తన తీసుకురావడమే నా లక్ష్యం" అని తన పోస్టులో వివరించారు. భూమి గుహల నుంచి పుట్టి, రాతితో చెక్కబడిన, కాంతిని ప్రేమించే రూపం లేనిదే 'కీయురి' అని ఆమె వీడియోలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా తన తొలి తెలుగు చిత్రం 'అలా మొదలైంది' 15 ఏళ్లు పూర్తి చేసుకున్నప్పటి జ్ఞాపకాలను కూడా నిత్యా గుర్తుచేసుకున్నారు. అప్పట్లో తాము తీస్తున్న రొమాంటిక్ కామెడీని ఎవరూ అర్థం చేసుకోలేదని, షూటింగ్ తర్వాత ఇరానీ చాయ్ తాగుతూ సమయం గడిపేవాళ్లమని తెలిపారు. షూటింగ్ సమయంలో దర్శకురాలు నందిని రెడ్డి తనతో, "ఇకపై నువ్వు ఇలా స్వేచ్ఛగా రెస్టారెంట్లోకి వెళ్లలేవు" అన్నారని, ఆ మాటలు తనకు అప్పట్లో వింతగా అనిపించాయని చెప్పారు. చిన్న సినిమాలు చేసుకుంటూ స్వేచ్ఛగా ఉండాలనుకున్న తన జీవితాన్ని 'అలా మొదలైంది' పూర్తిగా మార్చేసిందని, ఇప్పుడు నిర్మాతగా అదే స్ఫూర్తితో ముందుకు వెళుతున్నానని ఆమె తన పోస్టులో పేర్కొన్నారు.

# టార్గెట్ టాలీవుడ్?

ప్రముఖ వ్యాపారవేత్త, గాయని అనన్య బిర్లా చిత్ర నిర్మాణ రంగంలోకి అడుగుపెడుతూ -బిర్లా స్టూడియోస్- పేరుతో కొత్త ప్రొడక్షన్ హౌస్‌ను ప్రారంభించారు. ఈ సంస్థ కమర్షియల్ సినిమాలు, కొత్తదనంతో కూడిన ప్రయోగాత్మక చిత్రాలపైనా దృష్టి సారించనుంది. తాజా సమాచారం మేరకు.. బిర్లా స్టూడియోస్ తమ తొలి ప్రాజెక్టుల కోసం బాలీవుడ్ దిగ్గజ దర్శకులతో చర్చలు జరుపుతోంది. కమర్షియల్ కామెడీ చిత్రాల స్పెషలిస్ట్ అనీస్ బజ్మీ, పింక్, సర్దార్ ఉదమ్ వంటి కంటెంట్ ఓరియెంటెడ్ చిత్రాల దర్శకుడు షూజిత్ సిర్కార్, ప్రయోగాత్మక చిత్రాలు ఏ వెడ్నెస్ డే, స్పెషల్ చబ్బీస్ లాంటి ప్రయోగాత్మక చిత్రాలకు దర్శకత్వం వహించిన నీరజ్ పాండే తో బిర్లా స్టూడియోస్ చర్చలు జరుపుతోంది. వీరితో చర్చలు సఫలమైతే త్వరలోనే అధికారికంగా ఒప్పందాలు కుదిరే అవకాశం ఉందని కూడా తెలుస్తోంది. బిర్లా స్టూడియోస్ కేవలం హిందీకే పరిమితం కాకుండా ప్రాంతీయ భాషల్లో సినిమాలు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ముఖ్యంగా టాలీవుడ్ లో అడుగుపెట్టేందుకు సమగ్ర ప్రణాళికను రూపొందిస్తున్నారని తెలిసింది. అలాగే మలయాళం, గుజరాతీలోను సినిమాలు నిర్మించేందుకు మొదటి దశలో ప్లాన్ చేస్తోంది. ఆంగ్లంలోను అంతర్జాతీయ కాన్సెప్టులతో సినిమాలు తీయనున్నారు.



# ఢిల్లీ హైకోర్టులో ఇళయరాజాకు షాక్



ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఇళయరాజా స్వరాలు దశాబ్దాలుగా సినీ ప్రపంచాన్ని, అభిమానులను ఉర్రూతలూగిస్తున్నాయి. ఆయన సొంత పాటలపై హక్కుల కోసం జరుగుతున్న చట్టపరమైన పోరు ఇప్పుడు కీలక మలుపు తీసుకుంది. ఢిల్లీ హైకోర్టు తాజాగా ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు ఇళయరాజాకు ప్రతికూలంగా మారాయి. 1976 నుంచి 2001 మధ్య కాలంలో ఇళయరాజా సంగీతం అందించిన 134 సినిమాల ఆడియో హక్కులు ప్రముఖ ఆడియో సంస్థ 'సరిగమ'కే చెందుతాయని కోర్టు స్పష్టం చేసింది. నాటి చిత్ర నిర్మాతలు ఈ హక్కులను శాశ్వతంగా సరిగమకు అమ్మేశారని, కాపీరైట్ చట్టం ప్రకారం ఇళయరాజాకు యాజమాన్య హక్కులు లేవని జస్టిస్ తుషార్ రావు గెడేలా తీర్పు ఇచ్చారు. ఈ వివాదం 'ఎప్ ఇనియా పొన్ నిలవే' వంటి ఆల్‌టైమ్ హిట్ సాంగ్‌తో మొదలైంది. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లకు ఇళయరాజా అనుమతులు ఇవ్వగా సరిగమ సవాల్ చేసింది. "నిర్మాత వద్ద వేతనం తీసుకుని కంపోజ్ చేసిన పాటలపై హక్కులు నిర్మాతకే చెందుతాయి. ఈ క్రమంలో ఆ హక్కులు సరిగమకు బదిలీ అయ్యాయి" అని కోర్టు స్పష్టం చేసింది. అయితే, ఈ తీర్పుపై అప్పీల్ చేసే అవకాశాన్ని ఇళయరాజాకు కోర్టు కల్పించింది.



# అమీషా పటేల్‌కు నాన్ బెయిలబుల్ వారెంట్


బాలీవుడ్ నటి అమీషా పటేల్ కు చట్టపరమైన ఇబ్బంది ఎదురైంది. 2017లో జరిగిన ఒక వివాహ వేడుక ఈవెంట్‌కు సంబంధించిన గొడవలో ఆమెకు వ్యతిరేకంగా మొరాదాబాద్ కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. 2017లో ఆ వివాహ వేడుకలో ప్రదర్శన ఇవ్వడానికి అమీషా రూ14.50 లక్షల అడ్వాన్స్ తీసుకున్నారని, కానీ కార్యక్రమానికి హాజరు కాలేదని ఆమెపై ఈవెంట్ ఆర్గనైజర్ పవన్ వర్మ ఫిర్యాదు చేశాడు. తర్వాత ఆ డబ్బు తిరిగి ఇవ్వడానికి ఆమె ఇచ్చిన చెక్ బౌన్స్ అయ్యిందని తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ క్రమంలో అమీషా పటేల్ వరుసగా కోర్టు విచారణలకు గైర్హాజరు అయింది.



# అల్లు అర్జున్‌కు కావేరి బరువా సారీ

అల్లు అర్జున్‌పై 42 నిబంధనలు అంటూ వ్యాఖ్యలు చేసిన కావేరి బరువా వెనక్కి తగ్గింది. ఫిబ్రవరి 15న సోషల్ మీడియా వేదిక ట్విట్టర్లో బహిరంగ క్షమాపణ పోస్ట్ చేసింది. తాను చేసిన వ్యాఖ్యలకు ఎలాంటి ఆధారాలు లేవని, అవి తప్పేనని అంగీకరించింది. అల్లు అర్జున్‌పై అనవసర ఆరోపణలు చేసినందుకు చింతిస్తున్నానని పేర్కొంది. ఆమెను ఫాలో అయ్యే వారు తక్కువగా ఉండటంతో ఆ పోస్ట్ మొదట పెద్దగా వెలుగులోకి రాకపోయినా, తర్వాత వైరల్ అయింది.

# ఆసీస్ అవుట్



## టీ20 ప్రపంచకప్ నుంచి నిష్క్రమణ.. వర్షం కారణంగా జింబాబ్వే, ఐర్లాండ్ మ్యాచ్ రద్దు

### చెరో పాయింట్‌తో సూపర్-8కు జింబాబ్వే అర్హత.. ఐర్లాండ్ జట్టు కూడా టోర్నీ నుంచి నిష్క్రమణ

**టీ20 ప్రపంచకప్ 2026లో ఓ భారీ సంచలనం నమోదైంది. మాజీ ఛాంపియన్, పటిష్టమైన ఆస్ట్రేలియా జట్టు సూపర్-8 దశకు చేరకుండానే టోర్నీ నుంచి నిష్క్రమించింది. పల్లెకెలె అంతర్జాతీయ స్టేడియంలో మంగళవారం జింబాబ్వే, ఐర్లాండ్ జట్ల మధ్య జరగాల్సిన గ్రూప్ స్టేజ్ మ్యాచ్ వర్షం కారణంగా టాస్ కూడా పడకుండానే రద్దు కావడం ఆసీస్ అవకాశాలను దెబ్బతీసింది. మ్యాచ్ రద్దుతో జింబాబ్వే, ఐర్లాండ్ జట్లకు చెరో పాయింట్ లభించింది.**


**దీంతో జింబాబ్వే పాయింట్ల పట్టికలో 5 పాయింట్లకు చేరుకుని సూపర్-8లో తమ స్థానాన్ని ఖాయం చేసుకుంది. గ్రూప్-బిలో ఇప్పటికే శ్రీలంక 6 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా, జింబాబ్వే 5 పాయింట్లతో రెండో స్థానానికి చేరింది. దీంతో 2021 ఛాంపియన్ అయిన ఆస్ట్రేలియా తన చివరి మ్యాచ్‌లో గెలిచినా గరిష్ఠంగా 4 పాయింట్లను మాత్రమే అందుకోగలదు.**




ఈ సమీకరణాలతో మిచెల్ మార్ష్ నేతృత్వంలోని జట్టు టోర్నీ నుంచి నిష్క్రమించడం ఖాయమైంది. ఆసీస్ వరల్డ్ కప్ లో గ్రూప్ దశ నుంచే నిష్క్రమించడం 17 ఏళ్ల తర్వాత ఇదే మొదటిసారి. ఈ మ్యాచ్ రద్దు ఆస్ట్రేలియాకే కాకుండా ఐర్లాండ్‌కు కూడా చేదువార్తను అందించింది. తొలి రెండు మ్యాచ్‌లలో ఓడి, ఒమన్‌పై 96 పరుగుల భారీ విజయంతో రేసులోకి వచ్చిన ఐర్లాండ్.. సూపర్-8 ఆశలు సజీవంగా ఉండాలంటే ఈ మ్యాచ్‌లో గెలవడం తప్పనిసరి. కానీ వర్షం కారణంగా కేవలం ఒక పాయింట్‌తోనే సరిపెట్టుకుని, మొత్తం 3 పాయింట్లతో టోర్నీ నుంచి నిష్క్రమించింది. గత 2024 టీ20 ప్రపంచకప్‌కు అర్హత సాధించలేకపోయిన జింబాబ్వే.. ఈసారి ఆఫ్రికా క్వాలిఫయర్స్‌లో అగ్రస్థానంలో నిలిచి టోర్నీలో అడుగుపెట్టింది. సికందర్ రజా నేతృత్వంలోని ఈ జట్టు తమ తొలి మ్యాచ్‌లో ఒమన్‌పై 8 వికెట్ల తేడాతో గెలిచి, రెండో మ్యాచ్‌లో బలమైన ఆస్ట్రేలియాపై 23 పరుగుల తేడాతో సంచలన విజయం సాధించింది. ఇప్పుడు సూపర్-8 దశకు అర్హత సాధించి సత్తా చాటింది. సూపర్-8కు ముందు, జింబాబ్వే తమ చివరి గ్రూప్ మ్యాచ్‌లో గురువారం ఆతిథ్య శ్రీలంకతో తలపడనుంది. అయితే, సూపర్-8లో జింబాబ్వేకు అసలైన సవాలు ఎదురుకానుంది. డిఫెండింగ్ ఛాంపియన్ భారత్, 2024 రన్నరప్ దక్షిణాఫ్రికా, రెండుసార్లు ఛాంపియన్ వెస్టిండీస్‌లతో కూడిన కఠినమైన గ్రూప్‌లో జింబాబ్వే పోటీపడనుంది. సెమీఫైనల్‌కు చేరాలంటే ఈ గ్రూప్‌లో తొలి రెండు స్థానాల్లో నిలవాల్సి ఉంటుంది.

## బలుపు ఎఫెక్టే..!

ఆసీస్ పేలవ ప్రదర్శనతో టోర్నీ నుంచి నిష్క్రమించడంతో సోషల్ మీడియా వేదికగా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్యాట్ కమిన్స్, జోష్ హాజెల్ వుడ్ వంటి స్టార్ పేసర్లు గాయాలతో జట్టుకు దూరమవడంతో ఆ జట్టు బౌలింగ్ విభాగం బలహీనంగా మారిందని, స్పిన్నర్ ఆడం జంపా వైఫల్యం జట్టు పతనాన్ని శాసించిందని కొందరు చెబుతుంటే.. గతంలోలా కొత్త తరం ఆటగాళ్లను క్రికెట్ ఆస్ట్రేలియా సిద్ధం చేసుకోలేకపోయిందని మరికొందరు అభిప్రాయపడుతున్నారు. ఇంకొందరు మాత్రం మిచెల్ మార్ష్ బలుపుతోనే ఆసీస్ పతనం మొదలైందని కామెంట్ చేస్తున్నారు. 2023 వన్డే ప్రపంచకప్ గెలిచాక మిచెల్ మార్ష్ ట్రోఫీపై కాళ్లు పెట్టుకోవడం అప్పట్లో తీవ్ర వివాదాస్పదమైంది. ట్రోఫీపై అతను కాళ్లు పెట్టిన ఫొటో అప్పట్లో నెట్టింట వైరల్‌గా మారింది. ట్రోఫీ విలువ తెలియక ఆసీస్ ఆటగాళ్లు బలుపు చూపిస్తున్నారని భారత నెటిజన్లు అప్పట్లో తీవ్ర విమర్శలు గుప్పించారు. అయితే తమ ఆట ముందు ట్రోఫీ కూడా చిన్నదేనని ఆసీస్ ఆటగాళు అప్పట్లో బదులిచ్చారు. కానీ ఈ బలుపే వారికి శాపంగా మారిందని ప్రస్తుత నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. ఆ ఘటన తర్వాత ఆసీస్.. ఒక్క ఐసీసీ టోర్నీలో కూడా మెరుగైన ప్రదర్శన చేయలేదని గుర్తు చేస్తున్నారు.




## ఆసీస్.. ఇది మూడోసారి

ఆస్ట్రేలియా తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌ను ఒమన్‌తో ఆడాల్సి ఉంది. శుక్రవారం పల్లెకెలె వేదికగానే ఈ మ్యాచ్ జరగనుంది. ఐసీసీ టీ20 ప్రపంచకప్ చరిత్రలో ఆస్ట్రేలియా ఇలా లీగ్ దశలోనే నిష్క్రమించడం ఇది రెండోసారి. నాకౌట్ చేరకుండా వెనుదిరిగడం మూడోసారి. ఇంగ్లండ్ వేదికగా జరిగిన 2009 టీ20 ప్రపంచకప్‌లోనూ ఆస్ట్రేలియా లీగ్ దశలోనే వెనుదిరిగింది. గ్రూప్ దశలో వెస్టిండీస్,శ్రీలంక చేతిలో ఓడిన ఆసీస్.. ఒక్క మ్యాచ్ కూడా గెలవకుండానే టోర్నీ నుంచి నిష్క్రమించింది. సొంత గడ్డపై జరిగిన టీ20 ప్రపంచకప్ 2022 టోర్నీలో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన ఆస్ట్రేలియాకు చేదు అనుభవం ఎదురైంది. మొదటి మ్యాచ్‌లోనే న్యూజిలాండ్ చేతిలో చిత్తయిన ఆసీస్.. ఆ తర్వాత పుంజుకున్నప్పటికీ నెట్ రన్ రేట్ తక్కువగా ఉండటంతో సెమీఫైనల్ చేరకుండానే సూపర్ 12లో నిష్క్రమించింది. తాజా టోర్నీలో జింబాబ్వే, శ్రీలంక చేతిలో ఓటమిపాలై లీగ్ దశలోనే వెనుదిరిగింది. బౌలింగ్ వైఫల్యం ఆసీస్ కొంపముంచింది. స్టార్ బౌలర్లు ప్యాట్ కమిన్స్, జోష్ హాజెల్ వుడ్ గాయాలతో ఈ టోర్నీ దూరమవ్వడం ఆసీస్ కొంపముంచింది.



## రంజీల్లో షమీ జోరు!

టీమిండియా సీనియర్ పేసర్ మహమ్మద్ షమీ పట్టు వీడటం లేదు. టీమిండియా మేనేజ్‌మెంట్ పట్టించుకోకున్నా.. గాయాలు వేధిస్తున్నా.. బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్స్ నుంచి తొలగించినా ఈ బెంగాల్ పేసర్ వెనుకడుగు వేయడం లేదు. మెరుగైన ప్రదర్శన కనబరుస్తూ సెలెక్టర్లు, టీమిండియా మేనేజ్‌మెంట్‌కు ప్రశ్నలు సంధిస్తున్నాడు. తనలో ఇంకా ఆడే సత్తా ఉందని ఆటతోనే బదులిస్తున్నాడు. ప్రతిష్టాత్మక దేశవాళీ వన్డే టోర్నీ రంజీ ట్రోఫీ 2025-26లో భాగంగా జమ్మూ కశ్మీర్‌తో జరుగుతున్న సెమీఫైనల్లో బెంగాల్ తరఫున బరిలోకి దిగిన షమీ.. 8 వికెట్లతో సత్తా చాటాడు. చేతికి గాయమైనా.. కట్టు కట్టుకొని మరి ఈ మ్యాచ్ బరిలోకి దిగాడు. కోల్‌కతాలోని కల్యాణి క్రికెట్ గ్రౌండ్‌లో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో షమీ కెరీర్ బెస్ట్ ప్రదర్శన కనబర్చాడు. 22.1 ఓవర్లు బౌలింగ్ చేసిన 35 ఏళ్ల షమీ 90 పరుగులు మాత్రమే ఇచ్చి 8 వికెట్లు తీసాడు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో ఒకే ఇన్నింగ్స్‌లో షమీ 8 వికెట్లు తీయడం ఇదే తొలిసారి. ఇప్పటి వరకు 97 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడిన షమీకి 7/79 అత్యుత్తమ రికార్డ్. 2012-13 రంజీ ట్రోఫీలో ఈ ఫీట్ సాధించాడు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 7 ప్లస్ వికెట్లు తీయడం కూడా ఇదే రెండో సారి. మహమ్మద్ షమీ అద్భుత ప్రదర్శనతో ఈ మ్యాచ్‌లో బెంగాల్ తొలి ఇన్నింగ్స్‌లో 26 పరుగుల ఆధిక్యాన్ని అందుకుంది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన బెంగాల్ 328 పరుగులకు ఆలౌటైంది. అనంతరం జమ్మూ కశ్మీర్ 302 పరుగులకు కుప్పకూలింది. షమీ ఒక్కడే 8 వికెట్లు తీయగా.. ముఖేష్ కుమార్ 2 వికెట్లు పడగొట్టాడు. అయితే బెంగాల్ రెండో ఇన్నింగ్స్‌లో అనూహ్యంగా 99 పరుగులకే ఆలౌటైంది. దాంతో జమ్మూ కశ్మీర్ ముందు 126 పరుగుల స్వల్ప లక్ష్యం నమోదైంది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి జమ్మూ కశ్మీర్ 43/2తో నిలిచింది. ఆఖరి రోజు ఆటలో షమీ చెలరేగితేనే బెంగాల్ గెలవనుంది. దేశవాళీ క్రికెట్‌లో మూడు ఫార్మాట్లలో బెంగాల్ తరఫున బరిలోకి దిగిన షమీ.. ఈ సీజన్‌లో 21 మ్యాచ్‌ల్లో 67 వికెట్లు తీసాడు. అయినా సెలెక్టర్లు అతన్ని పట్టించుకోలేదు. 7 రంజీ మ్యాచ్‌ల్లో 36 వికెట్లు తీసిన షమీ.. విజయ్ హజారే ట్రోఫీలో 7 మ్యాచ్‌ల్లో 15, సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో 7 మ్యాచ్‌ల్లో 16 వికెట్లు పడగొట్టాడు. ఫిట్‌నెస్ సమస్యలతో భారత జట్టుకు దూరమైన షమీ.. మళ్లీ రీఎంట్రీ ఇవ్వలేదు. అతను చివరి సారిగా ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025 టోర్నీలో ఆడాడు. ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2023 ఫైనల్ తర్వాత ఒక్క టెస్ట్ మ్యాచ్ ఆడలేదు. ఎక్కువగా క్రికెట్ ఆడకపోవడం వల్లే షమీని జట్టుకు ఎంపిక చేయడం లేదని అగార్కర్ అప్పట్లో వెల్లడించాడు. కానీ 21 మ్యాచ్‌ల్లో 67 వికెట్లు తీసాడని, ఇప్పటికైనా జట్టులోకి తీసుకోవాలని నెటిజన్లు సూచిస్తున్నారు.




## స్కాట్లాండ్‌పై నేపాల్ సూపర్ చేజ్

### 7 వికెట్ల తేడాతో ఉత్కంఠ విజయం

టీ20 వరల్డ్ కప్‌లో వరుస ఓటములతో నిరాశపర్చిన నేపాల్, తమ ప్రస్థానాన్ని గెలుపుతో ముగించింది. గ్రూప్-సిలో భాగంగా తన చివరి లీగ్ మ్యాచ్‌లో స్కాట్లాండ్‌పై 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ముంబైలోని వాంఖడే స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో 171 పరుగుల భారీ లక్ష్యాన్ని నేపాల్ మరో 4 బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది. టోర్నీలో వరుసగా మూడు మ్యాచ్‌లలో ఓడిన నేపాల్‌కు ఇది తొలి విజయం కావడం విశేషం. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న నేపాల్‌కు స్కాట్లాండ్ బ్యాటర్లు సవాలు విసిరారు. ఓపెనర్ మైఖేల్ జోన్స్ (45 బంతుల్లో 71) అద్భుత అర్ధశతకంతో చెలరేగడంతో స్కాట్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 170 పరుగులు చేసింది. నేపాల్ బౌలర్లలో సోంపాల్ కామి 3 వికెట్లతో ఆకట్టుకున్నాడు. లక్ష్య ఛేదనలో నేపాల్‌కు ఓపెనర్లు కుశల్ భుర్టెల్ (43), ఆసిఫ్ షేక్ (33) శుభారంభం అందించారు. అయితే, స్కాట్లాండ్ బౌలర్ మైఖేల్ లీస్క్ వీరిద్దరితో పాటు కెప్టెన్ రోహిత్ పాడెల్ (16)ను కూడా ఔట్ చేయడంతో నేపాల్ 98 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన దీపేంద్ర సింగ్ ఐరీ, గుల్షన్ ఝా (24) మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశారు. ఐరీ కేవలం 23 బంతుల్లో 4 ఫోర్లు, 3 భారీ సిక్సర్లతో అజేయంగా 50 పరుగులు చేసి జట్టును విజయతీరాలకు చేర్చాడు. వీరిద్దరూ కలిసి నాలుగో వికెట్‌కు అబేధ్యంగా 73 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పడంతో నేపాల్ చారిత్రక విజయాన్ని అందుకుంది.

## యువరాజ్ సెంచరీ వృథా

### కెనడాపై న్యూజిలాండ్ విక్టరీ

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో న్యూజిలాండ్ సూపర్-8 చేరింది. గ్రూప్-డీలో భాగంగా కెనడాతో చెన్నై వేదికగా మంగళవారం జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన న్యూజిలాండ్ 8 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఈ విజయంతో గ్రూప్-డీ నుంచి రెండో జట్టుగా సూపర్-8కు అర్హత సాధించింది. అయితే కెనడా తరఫున శతకంతో రాణించిన యువరాజ్ సమ్రా కష్టం బుగ్గిపాలైంది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన కెనడా నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లకు 173 పరుగులు చేసింది. యువరాజ్ సమ్రా(65 బంతుల్లో 11 ఫోర్లు, 6 సిక్స్‌లతో 110) సెంచరీతో రాణించగా.. కెప్టెన్‌గా దిల్‌ప్రీత్ బజ్వా(39 బంతుల్లో 4 ఫోర్లతో 36) పర్వాలేదనిపించాడు. న్యూజిలాండ్ బౌలర్లలో మ్యాట్ హెన్రీ, జాకోబ్ డఫ్ఫీ, కైల్ జెమీసన్, జేమ్స్ నీషమ్ తలో వికెట్ తీసారు. అనంతరం న్యూజిలాండ్ 15.1 ఓవర్లలో 2 వికెట్లకు 176 పరుగులు చేసి మరో 29 బంతులు మిగిలి ఉండగానే సునాయస విజయాన్నందుకుంది. రచిన్ రవీంద్ర(39 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లతో 59 నాటౌట్), గ్లేన్ ఫిలిప్స్(36 బంతుల్లో 4 ఫోర్లు, 6 సిక్స్‌లతో 76 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీలతో న్యూజిలాండ్ విజయంలో కీలక పాత్ర పోషించారు. కెనడా బౌలర్లలో డిలన్, సాద్ బిన్ తలో వికెట్ తీసారు. ఈ మ్యాచ్‌లో 58 బంతుల్లో సెంచరీ బాదిన యువరాజ్ సామ్రా..టీ20 ప్రపంచకప్ చరిత్రలోనే ఈ ఫీట్ సాధించిన అత్యంత పిన్న వయస్కుడిగా చరిత్రకెక్కాడు. కేవలం 19 ఏళ్ల 141 రోజుల వయసులోనే ఈ ఫీట్ సాధించాడు.




## సూపర్-8లో టీమిండియాకు అసలైన సవాళ్లు

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో హ్యాట్రిక్ విజయాలతో టీమిండియా సూపర్-8 బెర్త్‌ను ఖరారు చేసుకుంది. పాకిస్థాన్‌తో గత ఆదివారం కొలంబో వేదికగా జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన భారత్ 61 పరుగుల తేడాతో విజయం సాధించి గ్రూప్-ఏ టాపర్‌గా నిలిచింది. అయితే సూపర్-8లో టీమిండియా తలపడబోయే జట్లపై స్పష్టత వచ్చింది. ఈ టోర్నీకి ముందు ఐసీసీ సూపర్-8 గ్రూప్స్ సీడింగ్ తీసింది. గ్రూప్ దశలో తలపడిన జట్లు మరోసారి సూపర్-8లో తలపడకుండా ఈ సీడింగ్ తీసారు. భారత్‌తో పాటు ఇప్పటికే సూపర్-8 సాధించిన సౌతాఫ్రికా, వెస్టిండీస్ ఒకే గ్రూప్‌లో ఉండనున్నాయి. మరో స్థానం కోసం ఆస్ట్రేలియా, జింబాబ్వే మధ్య పోటీ నెలకొంది. ఈ రెండు జట్లలో ఏ జట్టు అయితే సూపర్-8 చేరుతుందో ఆ జట్టుకే భారత్ గ్రూప్‌లో చోటు దక్కనుంది. ఒకవేళ ఆస్ట్రేలియా కూడా అర్హత సాధిస్తే ఈ గ్రూప్ మరింత టఫ్‌గా మారనుంది. సూపర్-8లో భారత్ మూడు మ్యాచ్‌లు ఆడనుంది. ఫిబ్రవరి 22న సౌతాఫ్రికాతో తొలి మ్యాచ్ ఆడనున్న భారత్.. 26న జింబాబ్వే, ఆస్ట్రేలియాలో ఒక జట్టుతో తలపడుతుంది.

**ఫిబ్రవరి 22: భారత్ వర్సెస్ సౌతాఫ్రికా(అహ్మదాబాద్, రాత్రి 7 గంటలకు)**

**ఫిబ్రవరి 26: భారత్ వర్సెస్ జింబాబ్వే/ఆస్ట్రేలియా(చెన్నై), రాత్రి 7 గంటలకు)**

**మార్చి 1: భారత్ వర్సెస్ వెస్టిండీస్(కోల్‌కతా, రాత్రి 7 గంటలకు)**



ఈవార్తలు
# ప్రజావాణి
సంపాదకీయం
www.evarthalu.com
నేటి ఈవార్తలు
బుధవారం 18-2-2026




# ఏఐ విప్లవం..
## సర్వజన హితమే లక్ష్యం

ప్రపంచవ్యాప్తంగా కృత్రిమ మేధ చర్చనీయాంశంగా మారిన వేళ, భారత్ వేదికగా జరుగుతున్న 'ఏఐ ఇంపాక్ట్ సదస్సు' సాంకేతిక రంగంలో నూతన శకానికి నాంది పలుకుతోంది. 'సర్వజన హితాయ.. సర్వజన సుఖాయ' అనే నినాదంతో ప్రారంభమైన ఈ సదస్సు, కేవలం సాంకేతిక ఆవిష్కరణలకే పరిమితం కాకుండా, సామాన్యుడి జీవితంలో ఏఐ ఏ విధంగా సానుకూల మార్పులు తీసుకురాగలదనే అంశంపై దృష్టి సారించింది. ప్రధాని మోదీ సూచించినట్లుగా, ఏఐ అనేది కేవలం యంత్రాల శక్తి కాదు, అది మానవాళి శ్రేయస్సుకు తోడ్పడే సాధనంగా ఉండాలి. ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, విద్యారంగాల్లో ఏఐ వినియోగాన్ని పెంచడం ద్వారా సమ్మిళిత వృద్ధిని సాధించడమే ఈ సదస్సు ప్రధాన ఉద్దేశం. ప్రపంచ ఏఐ చర్చల్లో అభివృద్ధి చెందుతున్న దేశాల గళాన్ని వినిపించడంలో భారత్ 'బ్రిడ్జ్ పవర్'గా నిలుస్తోంది. ఐదు రోజుల పాటు సాగే ఈ సదస్సులో 20 దేశాల ప్రతినిధులు, ఓపెన్ ఏఐ సీఈవో సామ్ ఆల్ట్‌మాన్, బిల్ గేట్స్ వంటి దిగ్గజాలు పాల్గొనుండటం ద్వారా భారత్ తన ప్రాధాన్యాన్ని చాటుతోంది. సాంకేతికత ఎంత వేగంగా విస్తరిస్తోందో, అదే స్థాయిలో సైబర్ దాడులు, డీప్‌ఫేక్స్ ముప్పు కూడా పెరుగుతోంది. సదస్సుపై సైబర్ దాడుల ముప్పు ఉందన్న నిఘా వర్గాల హెచ్చరికల నేపథ్యంలో, జీ20 తరహా పటిష్ట భద్రతను ఏర్పాటు చేయడం గమనార్హం. బాధ్యతాయుతమైన, సురక్షితమైన ఏఐ కోసం పటిష్టమైన చట్టపరమైన నిబంధనలు అవసరమని ఈ సదస్సు నొక్కి చెబుతోంది. ఏఐ వల్ల ఉద్యోగాలు పోతాయన్న ఆందోళనల మధ్య, ఈ సాంకేతికతను ఒక 'ఉత్పాదకత పెంచే సాధనం'గా చూడాలని నిపుణులు సూచిస్తున్నారు. భారత యువతకు ఏఐ రంగంలో సరైన శిక్షణనిస్తే, దేశ ఆర్థిక వ్యవస్థకు అది ఊతమిస్తుందని సదస్సు విశ్లేషిస్తోంది. సాంకేతికత ఎప్పుడూ మానవ మేధస్సుకు ప్రత్యామ్నాయం కాకూడదు, అది ఒక సహకారిగా మాత్రమే ఉండాలి. 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సు' ద్వారా భారత్ ప్రపంచానికి ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తోంది. అదే.. సాంకేతికత అనేది కేవలం లాభాల కోసమే కాదు, అది సమాజంలోని అట్టడుగు వర్గాల వరకు చేరినప్పుడే దానికి సార్థకత లభిస్తుంది అని. **- ఈవార్తలు సంపాదకీయ విభాగం**

# స్థిరాస్తి కొంటున్నారా..?

ప్రాపర్టీ కొనుగోలు అనేది ఒక ఓపెన్ ప్లాట్ కొనుగోలు కావచ్చు, ఒక అపార్ట్మెంట్ ఫ్లాట్ కొనుగోలు కావచ్చు, ఒక కట్టిన ఇల్లు కొనుగోలు కావచ్చు, లేదా ఒక వ్యవసాయ భూమి కొనుగోలు కావచ్చు. ఎలాంటి ప్రాపర్టీ కొనుగోలు అయినా సరే, సరియైన అవగాహన లేకుండా, ఎలాంటి ఆలోచన లేకుండా చెప్పుడు మాటలు విని గుడ్డిగా పెట్టుబడి పెట్టి కొనకూడదు. ముఖ్యంగా రియల్ ఎస్టేట్ బ్రోకర్ల మాటలు విని, వారి మాటలను గుడ్డిగా నమ్మి పెట్టుబడి పెట్టినచో దాని పర్యవసానాలు ఎలా ఉంటాయి, ఆ పర్యవసానాల ఫలితంగా పెట్టుబడి పెట్టేవారికి ఎలాంటి నష్టాలను కలిగించే విధంగా ఉంటాయి అని తెలుసుకుంటూ తీసుకోవలసిన జాగ్రత్తలు ఏమిటి? అన్న వివరాలు తెలుసుకోవాల్సిన అవసరం ఉంది.

సామాన్యముగా ఎవరైనా ఒక ప్రాపర్టీ కొనబోతున్నారు అంటే వారు కొనాలి అనుకుంటున్న ప్రాంతములో ఆ ప్రాపర్టీ ధరలు ఎలా ఉన్నాయో, ఏమైనా ప్రాపర్టీలు అమ్మకానికి ఉన్నాయా అని తెలుసుకునే ప్రయత్నంలో భాగంగా ఆయా ప్రాంతాల్లో తమకు తెలిసిన మిత్రులు, తెలిసినవారు లేదా బంధువులతో ఇట్టి విషయాన్ని చర్చిస్తారు. అప్పుడు ఆ బంధువులు లేదా మిత్రులు తమకు తెలిసిన ప్రాపర్టీ బ్రోకర్ను పరిచయం చేయిస్తారు. ఆ ప్రాపర్టీ బ్రోకర్లు ఆ ఏరియాలో తమకు తెలిసిన అమ్మకానికి ఉన్నటువంటి ప్రాపర్టీని చూయిస్తారు. సదరు బ్రోకర్ ఆ ప్రాపర్టీకి సంబంధించిన విషయాలను ఉన్నవీ-లేనివీ కల్పించి కొనదల్చుకున్న వారికి వివరించి చెబుతాడు. ఇక్కడ తెలుసుకోవలసిన ముఖ్య విషయం ఏమిటంటే బ్రోకర్ తాను చూయించిన ప్రాపర్టీని ఎలాగోలా అమ్మాలనే ఆలోచనలో ఉంటాడు. దానికి 1% నుండి 2% వరకు అతనికి కమీషన్ లభిస్తుంది. ఇట్టి కమీషన్, బ్రోకరుకు అమ్మకందారు, కొనుగోలుదారు ఇరుపక్షముల ద్వారా లభిస్తుంది. ఆ కమీషన్ కొరకు ఆశపడి, తనకున్న మార్కెటింగ్ మెళకువలన్నింటినీ ప్రదర్శించీ ఆ ప్రాపర్టీని కొనుగోలుదారునకు అంటగట్టే ప్రయత్నము చేస్తాడు. కొనుగోలుదారుడు ప్రాపర్టీని నచ్చినట్టైతే బ్రోకర్ అనే వాడు ఇదే సదావకాశంగా భావించి కొనుగోలుదారు పార్టీని చేతిలోనుండి పోనివ్వకూడదు అని తనచేత కనీసంలో కనీసం కొనుగోలు విలువలో 10% నుండి 20% వరకు టోకెన్ అడ్వాన్సును అమ్మకందారునకు కట్టిస్తాడు. లేనట్లయితే ప్రాపర్టీకి విపరీతమైన డిమాండ్ ఉన్నదని, ఆలస్యము చేసినచో ప్రాపర్టీ ఉండదనీ, ఇకపై మీ ఇష్టమనీ, తాను చేసేది ఏమీ లేదనీ ఒక హడావిడితో కూడిన గందరగోళ పరిస్థితిని నెలకొల్పుతాడు. ఇలాంటి సందర్భాలలో కొనుగోలుదారులకు సరియైన అవగాహన లేక, సలహాలు ఇచ్చేవారు లేక, ఒక అనిస్థితితో కూడిన పరిస్థితిలో కొనుగోలుదారులు టోకెను అడ్వాన్సును ఒక బాండు పేపర్ పైన నామ మాత్రముగా రాసుకుని యిస్తారు. ఇక్కడ రెండు రకములైన తప్పులు జరుగుతున్నాయి. మొదటిది కొనుగోలుదారు తాను ప్రాపర్టీ కొంటున్న విషయం ఎవరికి తెలియకుండా రహస్యముగా కొనాలనుకోవడం అయితే రెండవది ఎలాంటి నియమ నిబంధనలుపొందుపర్చకుండా బాండు పేపర్ పైన నామ మాత్రంగా రాసి సంతకాలు చేసి అడ్వాన్సు సొమ్మును చెల్లించడము. ఇలా తాము ఎలాంటి కండీషన్లు లేదా నియమ నిబంధనలు లేకుండా చెల్లించడం ద్వారా కొనుగోలుదార్లు న్యాయ సంబంధమైన చిక్కులలో చిక్కుకుంటున్నారు. కొంటున్న ప్రాపర్టీకి అడ్వాన్సు చెల్లించిన తర్వాత బ్రోకరు ప్రాపర్టీకి సంబంధించిన అన్నీ డాక్యుమెంట్లు కాపీలు కొనుగోలుదారునకు అప్పజెప్పవలసి ఉంటుంది. కానీ



వాస్తవ పరిస్థితులలో అలా జరగడం లేదు. ఇక్కడ కేవలం అమ్మకందారుడు తాను కొన్నటువంటి సందర్భమునకు సంబంధించిన సేల్ డీడ్ పత్రముల జిరాక్స్ కాపీ మాత్రమే యిచ్చి తెలిసినవారి ద్వారా తనిఖీ చేయించుకోమని చెబుతాడు. ఒకవేళ ప్రాపర్టీకి సంబంధించిన లింకు డాక్యుమెంట్లు అడిగినచో ఒక పరిమితి వరకు మాత్రమే ఇవ్వగలుగుతాడు. ఒక్కసారి అడ్వాన్సు చెల్లించిన తర్వాత బ్రోకరు అనే వాడు ఎలాంటి సహాయం చేయడు. ముఖ్యంగా తాను ఎలాంటి రిస్కు తీసుకోడు. కమీషన్ విషయంలో మాత్రము ముందుంటాడు. ఒక్క పైసా తగ్గకుండా ముక్కు పిండి మరీ వసూలు చేసుకుంటాడు.



### పాటించవలసిన జాగ్రత్తలు:

ఎప్పుడైనా ఒక ప్రాపర్టీని కొంటున్నప్పుడు ఆ ప్రాపర్టీకి సంబంధించిన పూర్తి లింకు డాక్యుమెంట్ పత్రములను బ్రోకరు ద్వారా అమ్మకందారు నుండి తీసుకోవాలి. ఆ లింకు పత్రముల ద్వారా మొదటగా భూమి స్వభావమును తెలుసుకోవాలి. భూమి వివిధ రకముల స్వభావమును కలిగి ఉండవచ్చు. అనగా వ్యవసాయ భూమి, గ్రామకంఠం భూమి, సర్కారు భూమి, యినాం భూమి, దస్తుగర్దన్ భూమి మొదలగునవి. ఇందులో వ్యవసాయ భూమి తప్ప మిగతా ఏవి కూడా కొనకూడదు. ఒకవేళ కొనదల్చుకొన్న ప్రాపర్టీ ఓపెన్ ప్లాట్ గానీ అపార్ట్మెంట్ ఫ్లాట్ కానీ లేక కట్టిన ఇల్లు అయితే ఆ ప్రాపర్టీకి సంబంధించిన భూమి వ్యవసాయ భూమి నుండి వ్యవసాయేతర భూమిగా మార్పిడి అనుమతులు ఉండి ఉండాలి. ఒకవేళ భూమి యినాం భూమి అయి ఉంటే దాని పరిమితులు గణించి తత్సంబంధిత రెవెన్యూ అధికారుల చేత ఓ.ఆర్.సి. అనుమతులు పొంది రెవెన్యూ రికార్డులలో భూమి హక్కుల మార్పిడి జరిగి ఉండాలి. అలా జరగని పక్షంలో సదరు భూమిని ప్రభుత్వము ఎప్పుడైనా స్వాధీనం చేసుకొనే అధికారం కలిగి ఉంటుంది. ప్రస్తుతం హైడ్రా సంస్థ చేస్తున్న పని అదే. తర్వాత ఎంత నెత్తి నోరు బాదుకున్నా ఫలితం ఉండదు. ప్రాపర్టీ ఉన్న వెంచర్ తత్సంబంధిత అధికార సంస్థ ద్వారా అనుమతులు పొంది ఉండాలి అనగా డి.టి.సి.పి. లేదా హుడా లేదా హెచ్.ఎం.డి.ఎ. లేదా రెరా వంటి సంస్థలఅనుమతులు పొంది ఉండాలి. ఒకవేళ కొంటున్న ప్రాపర్టీ అపార్ట్మెంట్ ఫ్లాట్ లేదా కట్టిన ఇల్లు అయితే ఆ ప్రాపర్టీ కట్టడము భవన నిర్మాణ అనుమతులు తత్సంబంధిత అధికార సంస్థల ద్వారా పొంది ఉండాలి. ఒకవేళ వెంచర్ లేఔట్ అనుమతులు లేని పక్షములో భూమి ఎల్.ఆర్.ఎస్. అనుమతులు తీసుకోవాలి. ఇన్ని జాగ్రత్తలు ఒక ఎత్తు అయితే ప్రాపర్టీ హక్కుదారుల హక్కులు, ఆ హక్కుల సంక్రమణలు, వారికి సంక్రమించిన హక్కుల విధానములో తీసుకోవలసిన జాగ్రత్తలు వేరు. ప్రాపర్టీ విషయంలో ప్రభుత్వ అనుమతులు అన్నీ ఉన్నా ఆ ప్రాపర్టీ అమ్మకందారుల హక్కులను పరిశీలించడము, జాగ్రత్త వహించడము ఎంతో ముఖ్యము. ఒక వేళ ప్రాపర్టీ అమ్మకందారు కష్టార్జితము అయితే తాను నేరుగా అమ్ముకోవచ్చు. కానీ అదే ఆస్తి అనువంశీకము అయినట్లైతే ఆ అనువంశీకుల ద్వారా ఆస్తి పంపకము జరిగి రాతపూర్వకంగా ఉండాలి లేదా ఆ వారిచే ప్రాపర్టీ అమ్మకం యందు తమకు ఎలాంటి అభ్యంతరము లేదని రాతపూర్వకమైన పత్రములు ఉండాలి. ఇన్ని జాగ్రత్తలు తీసుకుని ప్రాపర్టీని ఖరీదు చేయడం, కోట్ల రూపాయలను పెట్టుబడి పెట్టడం అనేది సామాన్య ప్రజానీకానికి ఇది ఒక కత్తి మీద సాము లాంటిది. అందుచేత యిట్టి భూమి సంబంధిత వ్యవహారాలలో తగిన అనుభవము ఉన్న ఒక మంచి అడ్వకేటు ద్వారా భూమి లేదా ప్రాపర్టీ దస్తావేజులను, భూమికి సంబంధించిన హక్కులు, హక్కుల సంక్రమణలు, అనువంశీకుల హక్కులు మొదలగు పరీక్షలు జరిపించుకొనిసదరు అడ్వకేట్ ద్వారా 'కొనవచ్చు' అనే నిర్ధారణకు వచ్చిన తర్వాతే కొనుగోలు చేయడం కొనుగోలుదారునికి ఎంతో శ్రేయస్కరం.



ఏజే కరణ్‌లాల్
అడ్వొకేట్, 9492557496
advocateajkl@gmail.com

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!

పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.